

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 345 | హైదరాబాద్ | శనివారం | 23-05-2026 | పేజీలు: 08


## 2 వేల కిడ్నీ మార్పిడులతో నిమ్స్

# అరుదైన రికార్డు

- వైద్య బృందాన్ని అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో నిమ్స్ ఘనత
- దేశంలోనే అరుదైన మైలురాయి సాధించిన యూరాలజీ విభాగం
- దక్షిణ భారతంలో నిమ్స్‌కు తొలి స్థానం
- దేశవ్యాప్తంగా మూడో స్థానంలో నిలిచిన నిమ్స్
- 95 శాతం మార్పిడులు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితం
- పేద రోగులకు పెద్ద భరోసాగా నిలిచిన నిమ్స్
- మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 మార్పిడులు
- ఆధునిక వైద్య సేవల్లో తెలంగాణకు గుర్తింపు
- అవయవ మార్పిడి రంగంలో కొత్త చరిత్ర సృష్టించిన నిమ్స్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్‌లోని నిజాం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశంలోనే అరుదైన మైలురాయిని చేరుకుంది. నిమ్స్ యూరాలజీ విభాగం 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి ప్రత్యేక రికార్డు సృష్టించింది. కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు జీవన భరోసా కల్పిస్తూ నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ విజయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

**సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు**

నిమ్స్ వైద్య బృందం సాధించిన ఈ అరుదైన ఘనతపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందిస్తూ ప్రభుత్వ వైద్య రంగానికి గుర్తింపు తీసుకొచ్చారని ప్రశంసించారు. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, సాంకేతిక పరిజ్ఞానం సమన్వయంతో నిమ్స్ ఈ స్థాయికి

..మిగతా 2లో






# నేడు యాదాద్రికి సీఎం రేవంత్

- రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- యాదాద్రికి వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి యాదాద్రికి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలో కార్యక్రమం
- భక్తులకు మెరుగైన సదుపాయాలే లక్ష్యమని ప్రభుత్వం
- యాదాద్రిలో ఆధ్యాత్మిక వాతావరణం
- భారీగా భక్తులు, ప్రజాప్రతినిధుల హాజరు అవకాశం
- భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (శనివారం) యాదాద్రి ఆలయాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో చేపట్టనున్న రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రిని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పలు మౌలిక వసతుల పనులను చేపడుతోంది. యాదాద్రి ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయ పరిసరాల విస్తరణ, రహదారులు, పార్కింగ్, భక్తుల వసతి, తాగునీరు, పరిశుభ్రత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రభుత్వం దృష్టి సారించింది.

**యాదాద్రికి కంచి పీఠాధిపతి రాక**


ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శంకర విజయేంద్ర సరస్వతి ఇప్పటికే యాదాద్రికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, వేదపండితులు ఘన స్వాగతం పలికారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన ఈరోజే యాదాద్రి చేరుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కంచి కామకోటి పీఠాధిపతి రాకతో యాదాద్రిలో ఆధ్యాత్మిక

..మిగతా 2లో

## శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద హైడ్రా యాక్షన్..
- ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాల నేలమట్టం
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు

02



## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే

# ఫ్యూచర్‌సిటీ రద్దు

- మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు
- అమెరికా పర్యటనలో మాజీ మంత్రి కీలక వ్యాఖ్యలు
- ఫార్మాసిటీకే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి అని స్పష్టం
- డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని వ్యాఖ్య
- ఫ్యూచర్‌సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతోందని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తోందని విమర్శ
- ఫార్మాసిటీని మళ్లీ పునరుద్ధరిస్తామని హామీ
- లక్షలాది ఉద్యోగాల కోసమే ఫార్మాసిటీ ప్రారంభించామని వెల్లడి
- 75 శాతం ఫార్మా, 25 శాతం ఇతర రంగాల లక్ష్యం అని వివరణ
- ప్రస్తుత ప్రభుత్వం వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపణ
- ప్రభుత్వ నిర్ణయాలు కోర్టులో నిలవవని వ్యాఖ్య



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టును రద్దు చేస్తామని మాజీ మంత్రి టీ హరీశ్ రావు ప్రకటించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అక్కడ నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు

..మిగతా 2లో

## రోడ్డుపై ధాన్యం పోసి నిరసన..

- సచివాలయం వద్ద కవిత భారీ ఆందోళన
- రోడ్డుపై ధాన్యం పోసి వినూత్న నిరసన
- రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలన్న డిమాండ్
- ఉద్రిక్తత మధ్య కవిత, కార్యకర్తల అరెస్ట్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్ సచివాలయం (సెక్రటేరియట్) ప్రధాన ద్వారం వద్ద తెలంగాణ రక్షణ సేన (TRS) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భారీ ఆందోళన చేపట్టారు. పార్టీ నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి ఆమె సచివాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (ఐకేపీ సెంటర్లు) తీవ్ర జాప్యం

..మిగతా 2లో




## అసెంబ్లీ రద్దు చెయ్.. ప్రజల తీర్పు ఏంటో చూద్దాం

- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్
- నెరవేరని హామీలపై తీవ్ర విమర్శలు
- రేవంత్‌కు ఓపెన్ ఛాలెంజ్.. అసెంబ్లీ రద్దు చేయాలన్న డిమాండ్
- 27 మంది ఎమ్మెల్యేలు రాజీనామాకు సిద్ధమన్న కేటీఆర్



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (KTR) తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ ఒక హైవోల్టేజ్ ఛాలెంజ్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా ప్రజలకు ఇచ్చిన ప్రామిసెస్ ఏవీ నెరవేర్చలేదని, స్టేట్‌లో కంప్లీట్‌గా గవర్నెన్స్ ఫెయిల్ అయిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఎన్నో కీలకమైన వాగ్దానాలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యంగా కామన్ పీపుల్‌ని ఇబ్బంది పెడుతున్న పెట్రోల్, డీజిల్ ప్రైసెస్ విషయంలో కాంగ్రెస్ లీడర్స్ అప్పట్లో చేసిన స్టేట్‌మెంట్స్, ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రేట్లు తగ్గించాల్సింది పోయి ప్రజలపై మరిన్ని భారాలు వేస్తున్నారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు

..మిగతా 2లో

## 24 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్

- జూన్ 18న పోలింగ్
- 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 24 స్థానాలు
- జూన్ 1న నోటిఫికేషన్ విడుదల
- నామినేషన్లకు జూన్ 8 వరకు గడువు
- జూన్ 9న నామినేషన్ల పరిశీలన
- జూన్ 11 వరకు ఉపసంహరణ అవకాశం
- పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు ప్రారంభం
- జూన్ 20లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి
- ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు
- పిల్లి సుభాష్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పదవీకాలం ముగింపు
- రాజకీయంగా కీలకంగా మారనున్న ఎన్నికలు




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

జూన్, జులై నెలల్లో దేశవ్యాప్తంగా 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక షెడ్యూల్‌ను విడుదల చేసింది. పది రాష్ట్రాల్లోని

..మిగతా 2లో

## బ్యాంకులు గ్రామీణాభివృద్ధికి సహకరించాలి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో వ్యాఖ్యలు
- క్రాప్‌లోన్స్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్‌కు సహకరించాలని సూచన
- గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులకు సరైన సమయమని వ్యాఖ్య
- తెలంగాణలో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి 130.78 శాతం
- వ్యవసాయ రంగానికి రూ.1.68 లక్షల కోట్ల రుణాల పంపిణీ
- పంట రుణాల్లో 102 శాతం లక్ష్య సాధన ప్రభుత్వ బాధ్యత
- రుణమాఫీతో గ్రామీణ రుణ సంస్కృతి పునరుద్ధరణ
- మొండి బకాయిలు 5.23 నుంచి 4.71 శాతానికి తగ్గుదల
- ఆయిల్ పామ్, ఉద్యానవన రంగాలకు రుణాల పెంపుపై దృష్టి
- గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలకు ఉదారంగా రుణాలివ్వాలని పిలుపు



02

# నేడు యాదాద్రికి సీఎం రేవంత్



మొదటిపేజీ తరువాయి

వాతావరణం నెలకొంది. వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. రేపటి కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**భద్రతా ఏర్పాట్లు పూర్తి**

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు, ప్రత్యేక భద్రతా చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. యాదాద్రిని తిరుమల తరహా ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఆలయ పునర్నిర్మాణంతో దేశవ్యాప్తంగా యాదాద్రికి ప్రత్యేక గుర్తింపు లభించింది. ఇప్పుడు కొత్త అభివృద్ధి పనులతో భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది.

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్‌సిటీ రద్దు

మొదటిపేజీ తరువాయి

చేస్తున్న ఫ్యూచర్‌సిటీ ప్రాజెక్టు అసలు ఉద్దేశ్యానికి విరుద్ధంగా మారిందని ఆరోపించారు. కేంద్ర పర్యావరణ శాఖ అసలు ఫార్మాసిటీ ప్రాజెక్టుకే అనుమతులు ఇచ్చిందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రాజెక్టు లక్ష్యాల నుంచి భిన్నంగా వ్యవహరిస్తే రైతుల భూములు తిరిగి ఇవ్వాల్సిన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. "డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో స్పష్టంగా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఒకవైపు కోర్టులో ఫార్మాసిటీ కొనసాగిస్తున్నామని చెబుతూ, మరోవైపు ఫ్యూచర్‌సిటీ పేరుతో కొత్త ప్రాజెక్టులు తీసుకొస్తోందని విమర్శించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం డ్రామా చేస్తోంది" అని ఆయన మండిపడ్డారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. అసలు పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యాన్ని పక్కనపెట్టి వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు.

**ఫార్మాసిటీ అసలు లక్ష్యం ఇదే**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీని ప్రారంభించినప్పుడు 75 శాతం ఫార్మా పరిశ్రమలు, 25 శాతం అనుబంధ రంగాలు ఉండేలా ప్రణాళిక రూపొందించిందని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దీనిని పూర్తిగా మార్చేసిందని ఆరోపించారు. "మేం 75 శాతం ఫార్మా, 25 శాతం ఇతర రంగాలు ఉండేలా చూశాం. కానీ ప్రస్తుత ప్రభుత్వం 75 శాతం వ్యాపారం, 25 శాతం మాత్రమే ఫార్మా ఉండేలా చేస్తోంది" అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఈ విధానం వల్ల అసలు పరిశ్రమల అభివృద్ధి లక్ష్యం దెబ్బతింటుందని అన్నారు.

**లక్షల ఉద్యోగాల కోసం ప్రాజెక్టు**

ఫార్మాసిటీ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును ప్రారంభించిందని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే ప్రధాన ఉద్దేశమని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మాసిటీని పునరుద్ధరిస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. అసలు లక్ష్యాలకు అనుగుణంగా ప్రాజెక్టును తిరిగి తీసుకువస్తామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు న్యాయపరంగా నిలబడవని హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. "ఈ ప్రభుత్వం ఏం చేసినా నడవదు.. కోర్టులో నిలబడదు" అని వ్యాఖ్యానించారు.

**రాజకీయంగా కీలక వ్యాఖ్యలు**

ఫ్యూచర్‌సిటీ, ఫార్మాసిటీ అంశాలపై హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా భూముల వినియోగం, పారిశ్రామిక విధానం, రియల్ ఎస్టేట్ ఆరోపణల నేపథ్యంలో ఈ అంశం మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం కనిపిస్తోంది.

## రోడ్డుపై ధాన్యం పోసి నిరసన..

మొదటిపేజీ తరువాయి




జరుగుతోందని, రైతులు పండించిన పంటను తక్షణమే సేకరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కవిత మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, తరుగు నెపంతో "కటింగ్స్" పేరుతో మిల్లర్లు, అధికారులు చేతులు కలిపి అన్నదాతలను నిలువునా ముంచుతున్నారని ఆమె ఆరోపించారు. రైతులకు మద్దతుగా నిలిచిన ఆమె.. తక్షణమే క్వింటాలు వరి ధాన్యానికి రూ. 500 చొప్పున బోనస్ చెల్లించాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వరితో పాటు జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి ఇతర ప్రత్యామ్నాయ పంటలకు కూడా ప్రభుత్వం కనీస మద్దతు ధర (MSP) కల్పించి ఆదుకోవాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు.

ఈ నిరసన సందర్భంగా కల్వకుంట్ల కవిత సచివాలయం మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై వరి ధాన్యాన్ని పోసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సచివాలయం వైపు వచ్చే వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిరసనకారులను అడ్డుకోవడానికి పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య నెట్టివేతలు, వాగ్వాదం జరిగి ఉద్రిక్తత మరింత పెరిగింది. చివరకు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు కవితతో పాటు ఆమె అనుచరులను, పార్టీ కార్యకర్తలను బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీస్ వాహనాల్లో ఎక్కించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని అరెస్ట్ అయ్యే సమయంలో కవిత స్పష్టం చేశారు.

## 2 వేల కిడ్నీ మార్పిడులతో నిమ్స్ అరుదైన రికార్డు

మొదటిపేజీ తరువాయి

చేరుకుందని సీఎం పేర్కొన్నారు.

**దక్షిణ భారతంలో నిమ్స్‌కు తొలి స్థానం**

కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల విషయంలో దక్షిణ భారతదేశంలో నిమ్స్ మొదటి స్థానంలో నిలవడం విశేషం. ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో ఇది అత్యంత కీలక విజయంగా వైద్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. దేశవ్యాప్తంగా గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ తొలి స్థానంలో ఉండగా, లూధియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత మూడో స్థానంలో నిమ్స్ నిలిచి తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది.

**పేదలకు వరంగా ఆరోగ్యశ్రీ**

2 వేల కిడ్నీ మార్పిడుల్లో 1,900 మంది రోగులు అంటే దాదాపు 95 శాతం మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందడం ప్రత్యేకతగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాలు ప్రాణాధారంగా మారాయని వైద్యులు చెబుతున్నారు. భారీ ఖర్చుతో కూడుకున్న కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను ఉచితంగా అందించడం వల్ల పేదలకు నిమ్స్ ఆశాకిరణంగా మారింది.

**మూడు సంవత్సరాల్లో 500 మార్పిడులు**

2023 జనవరి నుంచి గత మూడు సంవత్సరాల నాలుగు నెలల వ్యవధిలోనే నిమ్స్‌లో 500 కిడ్నీ మార్పిడులు జరగడం మరో విశేషం. ఇది వైద్య సేవల విస్తరణ, రోగుల విశ్వాసం, సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనంగా భావిస్తున్నారు. ప్రతీ ఏడాది కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్య పెరుగుతుండటంతో నిమ్స్ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోంది.

నిమ్స్ యూరాలజీ విభాగం వైద్యులు, శస్త్రచికిత్స నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక బృందం సమిష్టి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన నిపుణులు, నిరంతర పర్యవేక్షణతో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు.

**అవయవ మార్పిడి రంగంలో తెలంగాణకు గుర్తింపు**

నిమ్స్ సాధించిన ఈ ఘనతతో తెలంగాణ రాష్ట్రం అవయవ మార్పిడి వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థలో కూడా ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించవచ్చని నిమ్స్ నిరూపించిందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి కాలంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో కిడ్నీ మార్పిడి సేవలకు డిమాండ్ కూడా అధికమవుతోంది. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, జీవనశైలి మార్పుల కారణంగా కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో నిమ్స్ వంటి ప్రభుత్వ ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ఉచిత వైద్య సేవలతో ప్రాణాలు నిలుపుతున్న నిమ్స్**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షల రూపాయల ఖర్చుతో జరిగే కిడ్నీ మార్పిడి చికిత్సలను నిమ్స్ ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా అందిస్తోంది. దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నాయి. రోగుల చికిత్స మాత్రమే కాకుండా శస్త్రచికిత్స అనంతర సంరక్షణలో కూడా నిమ్స్ ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయితో నిమ్స్ వైద్య రంగంలో కొత్త చరిత్ర సృష్టించింది. ప్రభుత్వ వైద్య రంగంపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిన ఈ ఘనత తెలంగాణ వైద్య సేవల సామర్థ్యాన్ని దేశానికి చాటిచెప్పింది.




## 24 రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి

24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. ఈ ఎన్నికల ప్రక్రియ జూన్ 1న అధికారిక నోటిఫికేషన్‌తో ప్రారంభం కానుంది.

**నామినేషన్లకు కీలక తేదీలు ఖరారు**

ఈసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల దశలవారీ ప్రక్రియ ఇలా కొనసాగనుంది: జూన్ 1న నోటిఫికేషన్ జారీ చేయబడుతుంది. జూన్ 8 వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉంటుంది. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. జూన్ 11 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. ఈ దశలన్నీ పూర్తయ్యాక జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు.

**పోలింగ్ రోజే లెక్కింపు ప్రక్రియ ప్రారంభం**

జూన్ 18న పోలింగ్ ముగిసిన వెంటనే సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఈసీ తెలిపింది. అదే రోజే ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 20లోపు పూర్తిచేయాలని ఈసీ షెడ్యూల్‌లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు కూడా జూన్ 18న ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తున్న పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, సానా సతీష్‌ల పదవీకాలం జూన్ 26న ముగియనుంది. వీరి స్థానాలను భర్తీ చేయడానికి ఈ ఎన్నికలు కీలకంగా మారనున్నాయి.

**రాజకీయంగా కీలక పరిణామం**

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలతో రాష్ట్రాల రాజకీయ సమీకరణాలు మళ్లీ వేడెక్కనున్నాయి. ముఖ్యంగా సంఖ్యాబలం ఆధారంగా అభ్యర్థుల ఎంపిక, పార్టీ వ్యూహాలు కీలకంగా మారనున్నాయి. ఏపీలో నాలుగు స్థానాలపై ప్రధాన పార్టీల మధ్య పోటీ వ్యూహాలు త్వరలో స్పష్టమయ్యే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా 24 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ ఖరారవడంతో రాజకీయ వర్గాల్లో చురుకుదనం పెరిగింది. జూన్ 18న జరిగే పోలింగ్ ఫలితాలు పలు రాష్ట్రాల రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి.




## బ్యాంకులు గ్రామీణాభివృద్ధికి సహకరించాలి

హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):



తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో బ్యాంకులు చురుకైన భాగస్వాములు కావాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన, వ్యవసాయ రంగ అభివృద్ధి, గ్రామీణ పెట్టుబడులు, రుణాల పంపిణీపై కీలక సూచనలు చేశారు. గ్రామీణ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయమని పేర్కొంటూ, బ్యాంకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

**పంట రుణాలకు మాత్రమే పరిమితం కాకూడదు**

బ్యాంకర్లు కేవలం సాంప్రదాయ పంట రుణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా రుణాలు ఇవ్వాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి పెద్దఎత్తున రుణాల పంపిణీ జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాలు బలోపేతం అయితే గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణలో క్రెడిట్ డిపాజిట్ (సీడీ) నిష్పత్తి రికార్డు స్థాయిలో 130.78 శాతం నమోదవడం గొప్ప విషయమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని బ్యాంక్ డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లుగా ఉండగా, రుణాలు రూ.12.33 లక్షల కోట్లకు చేరాయని వెల్లడించారు. ఇది రాష్ట్ర ఆర్థిక చైతన్యానికి నిదర్శనమని చెప్పారు.

**వ్యవసాయ రుణాల్లో అద్భుత ప్రగతి**

వ్యవసాయ రంగానికి రుణాల పంపిణీలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసిందని మంత్రి తెలిపారు. నిర్ణీత లక్ష్యాన్ని మించి 102 శాతం ప్రగతి సాధించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరిందని, మొత్తం వ్యవసాయ రంగానికి రూ.1.68 లక్షల కోట్ల రుణాలను బ్యాంకులు అందించాయని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో రుణ సంస్కృతి తిరిగి పునరుద్ధరించబడిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాల కారణంగా బ్యాంకుల్లో వ్యవసాయ నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గడం సానుకూల పరిణామమని తెలిపారు.

**ఉద్యానవనం, ఆయిల్ పామ్ రంగాలకు అవకాశాలు**

తెలంగాణలో ఉద్యానవన రంగంతో పాటు ఆయిల్ పామ్ సాగుకు అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణతో రైతుల ఆదాయం పెరిగే అవకాశముందని చెప్పారు. పంట నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, సైలోల నిర్మాణానికి బ్యాంకులు ఉదారంగా రుణాలు ఇవ్వాలని మంత్రి కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సదుపాయాలు పెరిగితే రైతులు సరైన సమయంలో పంటను విక్రయించి మెరుగైన ధర పొందగలరని తెలిపారు.

**రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మద్దతు అవసరం**

రాష్ట్రంలో దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోలు) పనిచేస్తున్నాయని, వీటికి బ్యాంకులు తగిన ఆర్థిక మద్దతు అందించాల్సిన బాధ్యత ఉందని మంత్రి అన్నారు. ఎఫ్‌పీవోలు బలోపేతం అయితే చిన్న, మధ్య తరహా రైతులకు మార్కెట్ అవకాశాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధునికీకరణ, యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ.147.91 కోట్ల బడ్జెట్ కేటాయించిందని మంత్రి వెల్లడించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా బ్యాంకులు సహకరించాలని సూచించారు.

**కౌలు రైతులకు రుణాలు అందాలి**

కౌలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో పంట రుణాలు అందేలా బ్యాంకులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా పర్యావరణహితమైన సోలార్ వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్ పద్ధతులకు కూడా రుణ సదుపాయాలు గణనీయంగా పెంచాలని సూచించారు. గ్రామీణ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. వ్యవసాయ రుణాలు, ఫుడ్ ప్రాసెసింగ్, నిల్వ సదుపాయాలు, ఆయిల్ పామ్, ఉద్యానవనం వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తే రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## అసెంబ్లీ రద్దు చెయ్.. ప్రజల తీర్పు ఏంటో చూద్దాం

మొదటిపేజీ తరువాయి



బ్రతకలేని సిట్యుయేషన్ క్రియేట్ అయిందని విమర్శించారు.

ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఒక ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. "మీ కాంగ్రెస్ పరిపాలనపై, మీ డెవలప్‌మెంట్స్ పై మీకు అంత నమ్మకం ఉంటే.. దమ్ముంటే వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఫ్రెష్‌గా ఎలక్షన్స్‌కి వెళ్దాం" అంటూ సవాల్ చేశారు. అప్పుడు ప్రజల కోర్టులోనే తేల్చుకుందామని, ఈసారి పబ్లిక్ తీర్పు ఎలా ఉంటుందో చూసేందుకు తాము రెడీగా ఉన్నామని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి గనుక ఎన్నికలకు సిద్ధమైతే, తమ వైపు నుంచి యాక్షన్ ప్లాన్ కూడా రెడీగా ఉందని కేటీఆర్ ప్రకటించారు. రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ప్రస్తుతం తమ పార్టీకి ఉన్న 27 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ తక్షణమే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. అదే విధంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రిజైన్ చేసి, అందరం కలిసి ఒకేసారి జనాల్లోకి వెళ్దామన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలు ఎంత కోపంగా ఉన్నారో ఈ ఎలక్షన్స్ ద్వారా తేలిపోతుందని, సీఎం ఈ సవాల్‌ను స్వీకరించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## శంషాబాద్‌లో హైడ్రా మెరుపు దాడులు

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద హైడ్రా యాక్షన్..
- ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాల నేలమట్టం
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు



హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):

హైదరాబాద్ మహానగర పరిధిలో అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై హైడ్రా (HYDRAA) అధికారులు తమ ఉక్కుపాదాన్ని కొనసాగిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఎత్తున జరిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణలపై అధికారులు శుక్రవారం ఉదయం మెరుపు దాడి చేశారు. ఎయిర్‌పోర్ట్ కాలనీ పరిసరాల్లోని ఔటర్ రింగ్ రోడ్డు (ORR) పక్కన ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించిన అక్రమ కట్టడాలను బుల్డోజర్లతో పూర్తిగా కూల్చివేశారు.

ఈ ఐదెకరాల ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది భూస్వాములు, కేటుగాళ్లు కబ్జా చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే పక్కా నిర్మాణాలను లేపారు. ఈ వ్యవహారంపై పక్కా సమాచారం అందుకున్న హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. కూల్చివేతల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా , బాధితుల నుంచి అభ్యంతరాలు రాకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్తగా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసుల పహారా మధ్య హైడ్రా సిబ్బంది అక్రమ కట్టడాలను నేలమట్టం చేసి, సదరు ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

హైదరాబాద్ ,దాని చుట్టుపక్కల శివారు ప్రాంతాలలో చెరువులు, నాలాలు, , ప్రభుత్వ భూములను ఆక్రమణల నుండి కాపాడటమే లక్ష్యంగా హైడ్రా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నారు. ఎంతటి రాజకీయ పలికుబడి ఉన్నవారైనా సరే, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే వదిలిపెట్టేది లేదని ఈ చర్య ద్వారా అధికారులు మరోసారి స్పష్టం చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లాంటి హైప్రొఫైల్ ఏరియాలో జరిగిన ఈ కూల్చివేతల కలకలం ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# ప్రభుత్వ పథకాలకు విస్తృత ప్రచారం కల్పించండి

- **తప్పుడు ప్రచారాలు లేకుండా ప్రజలకు నిర్భయంగా నిజాలు చెప్పండి.**
- **ప్రభుత్వ పథకాలను గురించి మరింతగా వివరించాలి.**
- **అధికారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు.**

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 22(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నప్పటికీని అనుకున్న స్థాయిలో ప్రచారం కావడం లేదు. ఈ విషయాన్ని గుర్తించి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలి అని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రజా పాలన... ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు సరఫరా, సన్న బియ్యం పంపిణీ తదితర పథకాలను అమలు చేయడం వల్ల.. ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు. వరి ధాన్యం ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నాం. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆలోచనలు లేకుండా విమర్శలు చేస్తున్నారు. ఇటువంటి సందర్భంలో జరుగుతున్న కార్యక్రమాల వివరాలను గురించి ప్రజలకు తెలియ చెప్పకుంటే వాళ్ళు చెప్పిందే నిజం అని నమ్మే పరిస్థితులు ఉంటాయి. తప్పుడు ప్రచారాలు లేకుండా ప్రజలకు నిర్భయంగా నిజాలు చెప్పండి. ప్రభుత్వ పథకాలను గురించి మరింతగా వివరించాలి అని అధికారులకు ఎమ్మెల్యేజీఎంఆర్ సూచించారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



అందించాలి అనే ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు వెళ్లకుండా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విధంగా బడిబాట కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

**99 రోజుల కార్యక్రమం విజయవంతం : కలెక్టర్ కుష్బూ గుప్తా**

ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం అయిందని కలెక్టర్ కుష్బూ గుప్తా చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలో కార్యక్రమాలు కొనసాగాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించుకోగలిగామని.. దీనివల్ల ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# పర్మిషన్ లేని స్కూల్లలో అడ్మిషన్ చేయకండి పిడిఎస్ యు

**శంకర్ పల్లి మే 22(ప్రజాక్షేత్రం):**



విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే 2026 27 విద్య అకాడమీక్ ఇయర్ లో పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ చేసే ముందు ఆ పాఠశాలకి పర్మిషన్ ఉందా? ఉంటే ఆ లెటర్ చూపించమని అడగండి బస్సులకు పర్మిట్ ఉందా లేదా తెలుసుకోండి. అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు. అదేవిధంగా పర్మిట్, పర్మిషన్, డ్రైవర్ లైసెన్స్, కావలసిన విధంగా లేకుండా బస్సులు నడిపితే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు పిల్లల ప్రాణాలు పోతే తల్లిదండ్రులకే బాధగా ఉంటుంది. కాబట్టి 2009 విద్యాహక్కు చట్ట ప్రకారం కావలసిన అన్ని వసతులు ఉన్నాయా లేవా చూసి తెలుసుకోండి. నర్సరీ లో ఉండేది చిన్న పిల్లలు వాళ్లు ఆడుకోని అలసిపోయి నిద్రపోతారు. అలాంటి చిన్నపిల్లలకి చదువు చెప్పడానికి వ్యాపార ఆలోచనలతో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు 40 వేల నుండి 60 వేల వరకు ఫీజులు తీసుకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫీజుల విషయంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు కల్లబొల్లి మాటలు చెప్పి రకరకాల పేరుతో ఇష్టం వచ్చినట్టు ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు అలాంటి పాఠశాలలా గుర్తింపు రద్దు చేసి వాటి పైన చర్యలు తీసుకోవాలి. విద్యార్థులను అడ్మిషన్ చేసే ముందే కట్టిన ప్రతి ఫీజు కి రిసిప్ట్ తీసుకోండి. పిల్లలకి మంచి భవిష్యత్తు ఉండాలని మంచి చదువు చదివించాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది రాజకీయ నాయకులు విద్యని వ్యాపారంగా మార్చి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అనేక రకాల పేర్లతో సీబీఎస్ఈ అని ఇంటర్నేషనల్ స్కూల్ అని కొత్త రకమైనవి పెట్టి అత్యధిక ఫీజులతో విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బంది పెడతారు. పర్మిషన్ లేకుండానే ఆన్లైన్లో అడ్మిషన్లు తీసుకుంటున్న కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్ జిల్లాలో చాలా ఉన్నాయి. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భద్రత కోసం ఆలోచించాల్సిన అవసరం ఉంది. కాబట్టి పర్మిషన్ లేని స్కూల్ లలో తమ పిల్లలను అడ్మిషన్ చేయకండి. అని అన్నారు.

---

# గ్రామ అభివృద్ధి ద్యేయం

- **బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్**

**సంగారెడ్డి మే 22(ప్రజాక్షేత్రం):**



బీరంగూడ సమగ్ర అభివృద్ధి కీ అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధి ని సాధించాలని బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ పేర్కొన్నారు. బీరంగూడ గ్రామ అధ్యక్షులు అడెల్లి రవీందర్ అధ్యక్షతన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో గ్రామ అభివృద్ధి విషయాలు జిహెచ్ఎంసి అధికారాలతో ఫోన్ లో మాట్లాడి అభివృద్ధి కార్యక్రమం గురించి అధికారులను పనులు వేగవంతం చేయాలనీ కోరడమైనది. శుంబుణికుంట చెరువు అభివృద్ధి స్మశాన వాటిక అభివృద్ధి గురించి అధికారులను ఫోన్ లో సంప్రదించడం జరిగింది. మరియు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం పై దేవాలయం పవిత్రత దెబ్బటిసే విదంగా మహాశివారాత్రి వంటి దైవ కార్యక్రమం సమయంలో భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా ఎటువంటి నిర్మాణాలు దేవాలయం చుట్టూ పక్కల జరుగకుండా అధికారులకు ప్రజా ప్రతినిధులను కలవాలని నిర్ణయం చేయడం జరిగింది. ఇట్టి సమావేశం లో ఉపాధక్షులు పిర్జపతి సత్యనారాయణ నక్కల కిష్టయ్య ప్రధాన కార్యదర్శి చిన్న వీరేశం కోశాధికారి బంటుశివ కార్యదర్శి దండు జ్ఞానేశ్వర్ కార్యవర్గ సభ్యులు బంటు ప్రవీణ్ కుహది ప్రభాకర్ ఎడ్ల అశోక్ మొదలగు వారు పాల్గొన్నారు.

---



# గుంతలమయమైన రోడ్డుకు మరమ్మతులు

- **సొంత నిధులతో పనులు చేపట్టించిన మాజీ ఎంపీటీసీ**

**శంకర్‌పల్లి మే 22(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి నుంచి గండిపేట్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నెమ్మదిగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. పలువురు ప్రయాణికులు చిన్నపాటి ప్రమాదాలకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఈ సమస్యను గుర్తించిన మాజీ ఎంపీటీసీ తలారి మైసయ్య వెంటనే స్పందించారు. అధికారుల అనుమతి తీసుకుని తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టించారు. జేసీబీలు, నిర్మాణ సామగ్రితో గుంతలను పూడ్చివేసి రహదారిని సరిచేయించారు. దీంతో రాకపోకలు కొంతవరకు సులభతరమయ్యాయి.

ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకొచ్చి పనులు చేయించడంపై స్థానికులు మైసయ్యను అభినందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.




---

# తెలంగాణ కాంగ్రెస్ ఎస్సి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనేరాలి నరేష్ రాజా

**వికారాబాద్ బ్యూరో మే 22(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ కాంగ్రెస్ ఎస్సి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనేరాలి నరేష్ రాజాను నియమిస్తూతెలంగాణ రాష్ట్ర కాంగ్రెస sc విభాగం రాష్ట్ర అధ్యక్షులు కావంపల్లి సత్యనారాయణ నియామక పత్రాన్ని అందజేశారు తూప్రాన్ కు చెందిన అనేరాలి నరేన్ రాజాని నేనిచ్చి నందున ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మీద ఉంచిన నమ్మకాన్ని మమ్ము చేయకుండా పార్టీ పట్టిష్ట కోసం తన వంతు కృషి చేస్తానని అని తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున కరిగే కి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు రాష్ట్ర అధ్యక్షులు కొల్లంపల్లి సత్యనారాయణ కి సీనియర్ నాయకులకు ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

---

# నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి..

- **బాధిత రైతు రాజమౌళిని ప్రభుత్వం ఆదుకోవాలి.**

**చిగురుమామిడి, మే 22(ప్రజాక్షేత్రం):**



మండలంలోని ఇందుర్తి గ్రామంలోని నల్లల బావి సమీపంలో బుర్ర శ్రీను అనే రైతు పొలం వద్ద లూజ్ వైర్లతో ప్రతి సంవత్సరం ప్రమాదాలు జరుగుతున్నయని పలుమార్లు రైతులు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదని, వారి నిర్లక్ష్యం మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, విద్యుత్ శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఇందుర్తి గ్రామానికి చెందిన నర్సింగోజు రాజమౌళి పశువుల పాక వద్ద జరిగిన షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో లక్ష ఇరవై వేల రూపాయల విలువ చేసే చుడి గేదె తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుందని బాధిత రైతును ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని తోటి రైతులు కూన పెద్దన్న,బుర్ర శ్రీనివాస్,బందెల శ్రీనివాస్,సంధవేని మల్లయ్య తదితరులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రమాదంలో అక్కడ ఉన్న దాదాపు 500గడ్డి కట్టలు కాలిపోయాయని,గతంలో మోటర్లు పైపులు కూడా కాలిపోయిన సంఘటన ఉన్నాయని రైతులు చెప్పారు. గేదె 80శాతం పూర్తిగా మంటల్లో కాలిపోయిందని కోరారు.వెంటనే విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు స్పందించి లూజ్ వైర్లను సరి చేయించి రైతుకు న్యాయం చేయాలని తోటి రైతులు డిమాండ్ చేస్తున్నారు.

---

# దైవాలగూడలో విషాదం.. అగ్నికి ఆహుతైన ఇల్లు – కన్నీటిలో బాధిత కుటుంబం

**షాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండలంలోని దైవాలగూడ గ్రామంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుని ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రి, గృహోపకరణాలు అగ్నికి ఆహుతై అపార ఆస్తి నష్టం సంభవించింది. బాధితుడు తూర్పాటి వెంకటయ్య కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులుగా మారింది.స్థానికుల సమాచారం మేరకు మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో గ్రామస్తులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించి,అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఇంట్లోని సామాన్లు పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో 15 లక్షల రూపాయల నష్టం,8,తులాల బంగారం,40 తులాల వెండి నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు తూర్పాటి వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. ఘటన విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.



---



# షాబాద్ మండలంలో సెంట్రింగ్ కార్మికుల సమ్మె

- **పాల్గొన్న అధ్యక్షుడు కృష్ణ, ఉప అధ్యక్షుడు ఆంజనేయులు, ఈ సి మెంబర్ రవి**

**షాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**

షాబాద్ మండల కేంద్రంలో సెంట్రింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, కార్మికులకు భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడతామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఈ సి మెంబర్ రవి,పలువురు కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

---

# సెంటర్ల చుట్టూ తిరిగే తిప్పలు తప్పాయ్..

- **సురంగల్ జనం 'ఆధార్' గోస తీర్చిన కౌన్సిలర్ శ్రీధర్!**
- **దూరం వెళ్లే పని లేకుండా ఊర్లోనే స్పెషల్ డ్రైవ్**
- **వృద్ధుల కార్డుల్లో ఏపీ అడ్రస్ అవుట్.. తెలంగాణ ఇన్!**
- **కౌన్సిలర్ సూపర్ చొరవ.. ఖర్చు లేకుండానే పని ఖతం**

**మొయినాబాద్, మే 22(ప్రజాక్షేత్రం):**

ఆధార్ కార్డులో చిన్న తప్పున్నా సెంటర్ల చుట్టూ తిరగాల్సిందే.. వందల రూపాయలు తగలేయాల్సిందే! ఈ తిప్పలన్నింటికీ చెక్ పెడుతూ సురంగల్ జనం కోసం కౌన్సిలర్ కర్రోళ్ల శ్రీధర్ 'ఆధార్' అండగా నిలిచారు. 14వ వార్డు సురంగల్‌లో శుక్రవారం ఆయన స్పెషల్ ఇంట్రెస్ట్‌తో ఏర్పాటు చేసిన ఆధార్ డ్రైవ్‌కు పబ్లిక్ నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు, ఎండల వల్ల చిన్న పిల్లలను, వృద్ధులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లలేక నరకం చూస్తున్న జనం కష్టాలను గమనించిన కౌన్సిలర్.. ఏకంగా ఆధార్ టీమ్‌నే ఊట్లోకి రప్పించారు. ఈ క్యాంప్‌లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ చిటికెలో క్లియర్ అయ్యాయి. ముఖ్యంగా పలువురు వృద్ధుల కార్డుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ అడ్రస్‌లు మారిపోయి.. 'తెలంగాణ' అడ్రస్‌లు అప్‌డేట్ అయ్యాయి. ఇంటి నంబర్లు, తప్పుల కరెక్షన్లతో పాటు చిన్న పిల్లలకు కొత్తగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా, ఇంటి ముందరకే ఆధార్ సేవలు తెచ్చిన కౌన్సిలర్ శ్రీధర్‌పై గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



---

# మెదక్‌లో ఏసీబీ వలలో విద్యుత్ శాఖ అధికారి..

- **రూ.25 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత.**

**మెదక్ జిల్లా మే 22(ప్రజాక్షేత్రం):**



నర్సాపూర్ డివిజన్‌లో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఏసీబీ వలలో చిక్కాడు. అధికారిక పనికి సంబంధించి లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, నర్సాపూర్ డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్)గా పనిచేస్తున్న ముద్దం రమణారెడ్డి, ఫిర్యాదుదారుడికి సంబంధించిన 11 వర్క్ బిల్లులను ముందుకు పంపేందుకు రూ.25 వేల లంచం డిమాండ్ చేశాడు. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను డివిజనల్ ఇంజనీర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేయడానికి ఈ డబ్బు కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి.



## నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

- **సర్పంచ్ మద్యపాగ కృష్ణ**

**మొయినాబాద్, మే 22(ప్రజాక్షేత్రం):**

గ్రామంలో రాబోయే రోజుల్లో ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ మద్యపాగ కృష్ణ తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు పూర్తి కావడంతో పాటు, ఎక్కడైనా లీకేజీలు లేదా సాంకేతిక సమస్యలు వస్తే తక్షణమే స్పందించి పరిష్కరించేందుకు ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు.గ్రామ ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ పాలకవర్గం ప్రథమ కర్తవ్యమని, ప్రజలు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముర్తుజాగూడను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- **కౌన్సిలర్ విక్రమ్‌రెడ్డి**

**మొయినాబాద్, మే 22(ప్రజాక్షేత్రం)**

ముర్తుజాగూడ వార్డును అన్ని రంగాల్లో ముందంజలో నిలిపి, నియోజకవర్గంలోనే ఒక ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని 12వ వార్డు కౌన్సిలర్ అవురం విక్రమ్‌రెడ్డి స్పష్టం చేశారు. '99 రోజుల ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వార్డు పరిధిలోని ప్రతి గల్లీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారం, మెరుగైన తాగునీటి సరఫరా అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తి లేదని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో ముర్తుజాగూడ ముఖచిత్రాన్ని మారుస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రగతి ప్రస్థానంలో గ్రామ యువత, పెద్దలు ఇలాగే సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు.



## ఎలిమినేటి జంగారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అర్థిక సహాయం అందజేత

**వలిగొండ మే 22(ప్రజాక్షేత్రం):**

వలిగొండ మండల కేంద్రంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన బండారు నర్సమ్మ కొన్నిరోజుల నుండిఅనారోగ్యంతో బాధపడుతూ మరణించారు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి (ఎజేఆర్ ఫౌండేషన్) అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో 5000 వేల రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# నత్త నడకగా హైదరాబాద్- బీజాపూర్ హైవే విస్తరణ పనులు...!

హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్ హెచ్163) విస్తరణ పనులు నత్త నడకగా కొనసాగుతున్నాయి. అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు కొనసాగుతున్న విస్తరణ పనులు మందకొడిగా నడుస్తున్నాయి.18 చోట్ల అండర్ పాసులు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు ఎనిమిది చోట్ల కూడా పనులు పూర్తి కాలేదు. గత ఏడాది ఆగస్టులో మొదలైన పనులు మొదట చురుకుగా కొనసాగాయి. ఈ ఏడాది మొదట్లో వేగంగా పనులు చేపట్టిన గత రెండు నెలల నుంచి మందకొడికే కొనసాగుతున్నాయి. కండ్లపల్లి, తోలుకట్ట, ముడిమాల ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న అండర్ పాస్ పనులు నర్తనడకగా నడుస్తున్నాయి. రెండు మూడు చోట్ల నిర్మాణం పూర్తయిన పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టడం లేదు. ఇప్పటికే సగభాగం నిర్మాణ పనులు పూర్తి అవుతాయని రెండో భాగం కూడా మొదలు పెడతారని మొదట ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఈ పనులు నత్తనక్కగా కొనసాగుతుంటే ఎలాంటి చర్య తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ రహదారికి నెత్తుటి రహదారి కొంతమంది పిలుస్తుంటారు ఎందుకంటే 200 మందికిపైగా ఈ రహదారిపై మృతి చెందారు. ఎట్టకేలకు విస్తరణ పనులు మొదలయ్యాయని ప్రజలు సంతోషపడ్డారు కానీ నేడు నతనక కొనసాగడంతో ఆందోళన చెందుతున్నారు.

**ఈ హైవేపై అనేక ప్రమాదాలు**

2018 నుంచి చోటు చేసుకున్న ప్రమాదాల్లో 200 మందికిపైగా మరణించగా.. సుమారు 600మంది గాయాలపాలయ్యారు. అన్ని అడ్డంకులు తొలిగి రోడ్డు విస్తరణ పనులకు మోక్షం కలగడంతో పనులు ప్రారంభం అయ్యాయి. ఏడు సంవత్సరాల అనిశ్చితి తర్వాత, హైదరాబాద్‌విజయపుర (బీజాపూర్) హైవే (ఎన్ హెచ్ 163) పై రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2018లో విధించిన స్టే ఉత్తర్వులను అక్టోబర్ 31న జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్ జి టి) ఎత్తివేసింది. యాదృచ్ఛికంగా, చేవెళ్ల సమీపంలో లారీబస్సు ఢీకొన్న ఘటనలో 19 మంది మరణించిన రోజున ఈ ఉత్తర్వు వెలువడింది. దేశంలో అత్యంత ప్రమాదాలకు గురయ్యే మార్గాలలో ఒకటిగా పరిగణించబడే టి ఎస్ పి ఎస్ (గతంలో అప్ప) జంక్షన్, మన్నెగూడ వయా మొయినాబాద్, చేవెళ్ల మధ్య 46 కి.మీ.ల మార్గాన్ని రూ.956 కోట్ల వ్యయంతో నాలుగు లేన్ల రహదారిగా విస్తరించనున్నారు. పూర్తి చేయడానికి ప్రభుత్వం రెండేళ్ల గడువును నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తుందని, భారతదేశంలోని అత్యంత ప్రమాదకరమైన రోడ్లలో ఒకటైన దీనిని సురక్షితమైన, పచ్చని కారిడార్‌గా మారుస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. 2018లో రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా హైవేను అప్‌గ్రేడ్ చేయడానికి కేంద్రం ఆమోదం తెలిపి, 2021 సెప్టెంబర్‌లో రూ. 928 కోట్లు మంజూరు చేసినప్పటికీ, ఆ మార్గంలో ఉన్న దాదాపు 916 పాత మర్రి చెట్లను నరికివేయడాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణవేత్తలు, వృక్ష ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్ల తర్వాత ఈ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. చెట్లను సంరక్షించడానికి సమగ్ర అధ్యయనం నిర్వహించాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ ఏ ఐ) మరియు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖను ఆదేశిస్తూ ఎన్ జి టి స్టే జారీ చేసింది. ఈ సమస్యను పరిష్కరించడానికి మునుపటి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు పెద్దగా ముందుకు సాగలేదు. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, రోడ్డు భద్రత మరియు పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను సాధించడానికి పర్యావరణ కార్యకర్తలతో చర్చలను తిరిగి ప్రారంభించింది.

అయితే, మరింత ప్రాణనష్టాన్ని నివారించడానికి విస్తరణ చాలా ముఖ్యమైనదని ప్రభుత్వం వాదించింది, అదే సమయంలో వారసత్వ వృక్షాలను రక్షించడానికి సాధ్యమైన ప్రతి చర్య తీసుకుంటామని హామీ ఇచ్చింది. పరిగికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే టి. రామ్ మోహన్ రెడ్డి మధ్యవర్తిత్వం తర్వాత అసలు హైవే డిజైన్‌ను మార్చడానికి ఎన్ హెచ్ ఎ ఐ జూలైలో అంగీకరించడంతో ఈ మలుపు తిరిగింది. ఈ రాజీ ప్రణాళిక ప్రకారం, మార్పిడి చేయాల్సిన చెట్ల సంఖ్య 916 నుండి కేవలం 156కి తగ్గింది, అయితే 760 మర్రి చెట్లు ఇప్పుడు వాటి స్థానంలోనే భద్రపరచబడతాయి.

**హైదరాబాద్-బీజాపూర్**
**హైవే విస్తరణ.. 18 చోట్ల అండర్ పాసులు.**

తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలను కలుపుతున్న హైదరాబాద్ బీజాపూర్ హైవే విస్తరణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. ఔటర్ రింగ్ రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ మేర నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు కూడా గత ఏడాది ఆగస్టులో మొదలయ్యాయి. ఈ రోడ్డు పూర్తయితే హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని అందరు భావిస్తున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలతో నరకప్రాయంగా మారిన హైదరాబాద్ బీజాపూర్ హైవే విస్తరణ పనులకు అడ్డంకులకు తొలగిపోయాయి.ఔటర్ రింగ్ రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కి.మీ మేర నాలుగు లైన్ల రహదారి విస్తరణకు కొంత ఇబ్బంది కలుగుతుంది. పనులు మందకొడిగా కొనసాడంతో ఆందోళనకు తినడంతో పాటు ఎందుకు పనులు కొన్ని ప్రాంతాలు ఆగిపోయాయి అర్థం కాక తల పట్టుకుంటున్నారు. అయితే గతంలో కొందరు రైతులు వ్యతిరేకించినా చాలా మంది భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రహదారి మార్గంలో మలుపులు తగ్గించడం, అండర్ పాస్‌లు నిర్మాణానికి సర్వే చేశారు. అందులో భాగంగా.. ఔటర్ రింగు రోడ్డు అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు మొత్తం 18 అండర్‌పాసులు నిర్మించనున్నారు. ఈ హైవే విస్తరణలో భాగంగా చేవెళ్ల, మొయినాబాద్ వద్ద బైపాస్ రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా 2 పట్టణాలు విస్తరించి ఉండడంతో నిర్మాణాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైవే అథారిటీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ గ్రామాల పక్క నుంచి హైవే బైపాస్ నిర్మించాలని నిర్ణయించారు.

తెలంగాణ కర్ణాటక రాష్ట్రాలను ఈ రహదారి కలుపుతోంది. కొడంగల్, పరిగి, పూడూరు, చేవెళ్ల, మొయినాబాద్ మీదుగా ఈ రహదారి సాగుతోంది. హైదరాబాద్ నగరం నుంచి కర్ణాటక గుల్బర్గా, బీజాపూర్‌తో పాటు వికారాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఈ మార్గమే ప్రధానమైనది. అయితే ఈ రహదారిపై రద్దీ ఎక్కువగా ఉండటం, నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు విస్తరణకు మొగ్గు చూపారు. 2018లో 163వ జాతీయ రహదారిగా గుర్తించి భూ సేకరణ చేపట్టారు. అప్పట్లోనే హైదరాబాద్ అప్పా జంక్షన్ నుంచి పూడూరు మండలం మన్నెగూడ వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777

## జనగణన ఇంటి గణన వేగవంతం చేయాలి

- **జూన్ 9 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలి**
- **కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, మే 22(ప్రజాక్షేత్రం):**

జగణన2027లో భాగంగా మే 11 నుంచి ప్రారంభమైన ఇంటి గణన ప్రక్రియను వేగవంతం చేసి, జూన్ 9వ తేదీ నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జనగణన2027 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటి గణన పురోగతిపై రాష్ట్ర జనగణన అధికారి భారతి హోలికేరి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి గణన ప్రక్రియను కచ్చితత్వంతో, సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ప్రతి దశను వేగవంతంగా పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియ ముగిసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కూడా కలెక్టర్ ఇంటి గణన కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, సీపీఓ హరికృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.




## పెద్ద మంగళారం 16వ వార్డులో పరిశుద్ధ కార్యక్రమం

**మొయినాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద మంగళారం 16వ వార్డులో కౌన్సిలర్ జంగం గీత వనజాక్షి సంజీవరావు ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పరిశుద్ధ కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, కాలనీలు, డ్రైనేజీలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను ప్రత్యేకంగా శుభ్రపరిచించారు. పారిశుధ్య సిబ్బందితో కలిసి కౌన్సిలర్ స్వయంగా పర్యవేక్షిస్తూ పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వ్యాప్తి, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల నీటి నిల్వలు ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్రతి వార్డులో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, స్థానిక నాయకులు, యువకులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## ఉమ్మడి మండలంలో ఆర్ టి సి బస్సుల కొరత లేకుండా చూడాలి

- **కొత్తగూడ, గంగారం మండల కేంద్రాలలో ఆర్ టి సి బస్టాండ్ లను నిర్మించాలి**
- **పూనేం సందీప్ తుడుం దెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షులు**

**కొత్తగూడ మే 22(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకం ఉమ్మడి కొత్తగూడ మండలం ఏజెన్సీ ప్రాంతం అయిన కొత్తగూడ, గంగారం మండలాల గిరిజన, గిరిజనేతర మహిళలు కొన్ని గ్రామాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకనికి నోచుకోవడం లేదు. ప్రజలు గ్రామాల నుండి మండల కేంద్రనికి, పట్టణాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దులో ఉన్న కొత్తగూడ, గంగారం మండలాల ప్రజలు నర్సంపేట, హన్మకొండ, వరంగల్, ప్రాంతాలకు అటు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు పట్టణాలకు పనుల నిమిత్తం వెళ్ళవలసి వస్తుంది. సరిపడా బస్సులు లేక ప్రజల ప్రయాణాలు వర్ణితతీతంగా ఉన్నాయి ప్రైవేట్ వాహనాల సహాయం తో వెళ్ళవలసి వస్తుంది. గతంలో బత్తుల పల్లి కార్లయి గోపాలపురం మాసం పల్లి తాటివారి వేంపల్లి గ్రామాలను కలుపుకొని తాటి వారి వేంపల్లి కి ఆర్ టి సి బస్సు నర్సంపేట డిపో నుండి వస్తుండెది గత కొన్ని నెలలుగా ఆ రూట్ లో బస్సు నీ ఆపివేయడం జరిగింది. అలాగే గతంలో ఉమ్మడీ కొత్తగూడ మండలం లో వెలుబెల్లి, ఎంచగూడెం మరి కొన్ని గ్రామాలకు ప్రభుత్వం బస్సు వస్తుండేది. ప్రస్తుతం ఆయా గ్రామాలకు బస్సు లు రాక ప్రజలు దూర ప్రాంతాలకు ప్రయాణం చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉమ్మడి కొత్తగూడ మండలంలో ఆర్ టి సి బస్సుల కొరత లేకుండా చూడాలని, అలాగే గతంలో హన్మకొండ డిపో నుండి వయా నర్సంపేట కొత్తగూడ గంగారం రూట్ లో ఇల్లందు వరకు బస్సు ఉండేది ప్రస్తుతం నిలిపివేశారు. నిత్యం దూర ప్రాంతాలకు ప్రయాణం చేసే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం స్పందించి మళ్ళీ ఈ రూట్స్ లో ఆర్ టి సి బస్సు లను కొనసాగించాలి. కొత్తగూడ, గంగారం మండలాలకు బస్టాండ్ లు, మంచినీటి సౌకర్యం టాయిలెట్ సౌకర్యం లేక ప్రజలు రోడ్లపై ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పై బస్సు, ప్రైవేట్ వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తుంది. రెండు మండలాలకు బస్టాండ్ లు నిర్మించాలని ఉమ్మడి మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే తుడుం దెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షుడు పూనేం సందీప్ ప్రజా పాలన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## బోధన్ డివిజన్‌లో తాగునీటి కష్టాలు.. అధికారులపై జనం ఆగ్రహం!

**బోధన్ మే 22(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ పరిధిలోని పుత్తూరు మండల కేంద్రంలో తాగునీటి కోసం ప్రజలు విలవిల్లాడుతున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో ని ఒకటో వార్డులో గత పది రోజుల నుండి తాగునీటి ఎద్దడితో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి బోర్లు మరమ్మత్తులు నాణ్యత లోపించడంతో వారంలో మూడుసార్లు పాడైపోవడం తో ప్రజలకు తాము నీటి సమస్య తప్పడం లేదు. ఉప సర్పంచ్ సొంత కాలనీలో సైతం ఉందనికాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ట్యాంకర్ ద్వారా పలు కాలనీలో చేస్తున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అసలు ఎండలు తీవ్రతరం అవడంతో తాగునీటి కష్టాలు తమను వెంటాడుతున్నాయని వాళ్ళ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం**



సుమారు 15 రోజుల నుండి రుద్రూర్ గ్రామంలో మిషన్ భగీరథ మంచిది సరఫరా సక్రమంగా పంపిణీ కాకపోవడంతో ప్రజలు అనేకవస్థలు పడుతున్నారు. పంచాయతీ బోర్ల ద్వారా మురుగునీళ్లు కలిసి నీళ్లు వస్తున్నాయని మిషన్ భగీరథ నీళ్లు వచ్చినట్లయితే కొంతమేర ఊరట లభిస్తుందని మహిళలు పేర్కొంటున్నారు. మిషన్ భగీరథ అధికారులు ఎటువైపు కన్నీటి చూడకపోవడంతో వారంలో మూడుసార్లు వచ్చి భగీరథ నీళ్లు సైతం లీకేజీలతో కలిసిదమవుతున్నాయని గ్రామస్తులు అధికంగా తీరుపై మండిపడుతున్నారు. అధికారుల స్పందించి శాశ్వత పరిష్కారాన్ని అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రతాపురం యాదగిరి స్వామి మృతి.

**వలిగొండ మే 22(ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వెంకటాపురం దేవస్థానం యందు గత 25 సం.లుగా అర్చకులుగా పనిచేయుచూ, దేవస్థానం అభివృద్ధికి ఎంతగానో సహాయ సహకారాలు అందించిన శ్రీ ప్రతాపురం యాదగిరి స్వామి (అర్చక) వారు ఈ రోజు ఉదయం పరమపదించారని బాధా తప్త హృదయాలతో తెలియచేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుని ప్రార్థిస్తున్నామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి సల్వాది మోహన్ బాబు తెలియజేశారు.



# "ప్రజల ప్రాణాలు కాపాడాలి"..అధికారులకు వినతి

- **డంపింగ్ యార్డ్–పవర్ ప్లాంట్ తరలించకపోతే ఆమరణ దీక్ష:శంకర్ నాయక్**
- **ప్రజల ప్రాణాల కంటే చెత్త నిర్వహణకే ప్రాధాన్యమా..?**
- **ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్**

**కుత్బుల్లాపూర్, మే 22(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ తండా2లో కొనసాగుతున్న డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్ స్థానిక ప్రజలకు శాపంగా మారిందని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమస్యల పరిష్కారం కోసం స్థానికులతో కలిసి దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత రెండేళ్లుగా డంపింగ్ యార్డ్‌లో చెత్తను బహిరంగంగా వేయడం, అనంతరం దానికి నిప్పంటించడం వల్ల తండా మొత్తం పొగతో కమ్ముకుపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతుండగా.. ఊపిరితిత్తుల వ్యాధులు, కిడ్నీ సమస్యలు, మహిళల్లో గర్భసంచి సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. "మోడల్ తండాలు చేస్తాం.. అభివృద్ధి చేస్తాం" అంటూ గతంలో ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు విమర్శించారు. డంపింగ్ యార్డ్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, తడిపొడి చెత్త వేరు చేసి ఎరువుల తయారీ చేపడతామని చెప్పినా అమలు కాలేదన్నారు. ప్రస్తుతం చెత్తను రోడ్లపైనే వేస్తూ తగులబెట్టడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి బాధితులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే డంపింగ్ యార్డ్, పవర్ ప్లాంట్‌ను జనావాసాల మధ్య నుంచి తక్షణమే తరలించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించకపోతే మూడు తండాల ప్రజలు కలిసి ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తండావారు పాల్గొన్నారు.

# అనుమతుల్లేని నిర్మాణాలపై అధికారుల కఠిన చర్యలు

- **దొమ్మర పోచంపల్లిలో మూడు అక్రమ నిర్మాణాల కూల్చివేత**
- **గాగిలాపూర్‌లో రోడ్డు ఆక్రమణ తొలగింపు**

**కుత్బుల్లాపూర్, మే 22(ప్రజాక్షేత్రం):**



ండిగల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. దొమ్మర పోచంపల్లి గ్రామంలోని సర్వే నెం.168లో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్న మూడు భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అలాగే గాగిలాపూర్ గ్రామంలో రహదారిని ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. ప్రజా రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు తగు చొరవ తీసుకోవాలి

- **పరిగి శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి**

**వికారాబాద్ బ్యూరో 22(ప్రజాక్షేత్రం):**





ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పరిగి శాసనసభ్యులు టి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, పరిగి శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరిగి శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. గతంలో కంటే రెట్టింపు రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగి ఉన్న ఇంటి యజమాని మరణించినట్లయితే ఆ కుటుంబానికి 5 లక్షల రూపాయలు చెల్లించేందుకు నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ చేయడం జరుగుతుందని, జిల్లాలో ఆత్మ కమిటీలను వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పరిగి మండలంలో రైతు విజ్ఞాన కేంద్రం మంజూరు అయ్యిందని దీనికి సంబంధించి మిట్టకోడూరులో 40 ఎకరాలు స్థలాన్ని కేటాయించాల్సింగా ఆయన కోరారు. 400 కెవి విద్యుత్ స్టేషన్ కు 84 ఎకరాలు, 33/11 కెవి సబ్ స్టేషన్ కు కావలసిన స్థలాలను కేటాయించినట్లయితే పనులు చేపట్టవచ్చునని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. మిషన్ భగీరథ మంచినీరు అందని ప్రాంతాలను గుర్తించి బోర్లను వేసి నీటి కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. అటవీ పందుల కారణంగా పంటలు నష్ట పోతున్నాయనే ఉద్దేశ్యంతో పంట పొలాలకు విద్యుత్తు కంచెలు వేయడం వల్ల విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని అలాకాకుండా ప్రత్యామ్నాయ విధానాలను ఎంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో అనుకున్న మేరకు గ్యాస్ సబ్సిడీ సిలిండర్లు అందడంలేదని తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సౌలభ్యం కోసం అదనంగా కొత్త చౌకధర దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాకు సాగునీరు తాగునీర అందించే విధంగా 10 వేల కోట్ల అంచనాలతో 2.8 సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి భూ సేకరణకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. 6 లైన్లతో కూడిన 35 వేల కోట్ల వ్యయంతో చేపట్టే రీజినల్ రింగ్ రోడ్డుకు భూ సేకరణ పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. జిల్లాలోని పూడూరు ప్రాంతంలో నేవీ ప్రాజెక్టు పనులు వేకవంతంగా చేపట్టడం జరుగుతుందని, దీనివల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలో 200 కోట్ల వ్యయంతో చేపట్టే యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, అదేవిధంగా కర్ణాటక సరిహద్దు వరకు 4 లైన్ల రోడ్డు, మన్నెగూడ నుండి వయా వికారాబాద్ మీదుగా తాండూర్ వరకు 4 లైన్ల రోడ్డు నిర్మాణ పనులు మంజూరు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి బీటీ రోడ్లకు సంబంధించి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ... గ్రామాల అభివృద్దే దేశాభివృద్ధి అన్నారు. చిత్తశుద్ధి, శ్రద్ధ అంకితభావంతో అధికారులు పనిచేసినట్లైతే ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో విజయవంతం అవుతమన్నారు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రైతు భరోసా, రైతు బీమా పథకాలను సమర్థవంతంగా చేపడుతున్నామన్నారు. రైతు భరోసా కింద ఇప్పటి వరకు 2,82,509 మంది రైతులు మూడు సీజన్లకు గాను 1,114.25 కోట్ల రూపాయల ప్రయోజనం పొందారని ఆయన తెలిపారు. రైతు బీమా పథకం కింద 2023 సంవత్సరం నుండి ఇప్పటి వరకు 2893 కుటుంబాలకు 144.65 కోట్ల రూపాయలను వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలో 12628 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగిందని, 7444 ఇండ్లు నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాల్లోకి 158.98 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మహాలక్ష్మి పథకంలో బాగంగా జిల్లాలో 500 రూపాయల సబ్సిడీనీ 119735 మంది లబ్ధి పొందుతున్నారని, ఇప్పటికి 297142 సిలిండర్లను సరఫరా చేయడం జరిగిందని దీనికి 10.43 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో చేయూత పెన్షన్ల కింద వివిధ విభాగాలకు సంబంధించి 105049 మంది ప్రయోజనం పొందుతున్నారని ఆయన తెలిపారు. రైతులను సన్న రకం వరి సాగుచేసే విధంగా ప్రోత్సహిస్తూ (వాన కాలం 202526) 2000 మంది రైతులకు 7.04 కోట్ల రూపాయలను సబ్సిడీ కింద వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాది ముభారక్ కింద 2023 నుండి 2026 ఆర్థిక సంవత్సరానికి 13724 మంది ప్రయోజనం పొందినవారికి 137.38 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మహిళా సంఘాలకు 2025 26 సంవత్సరానికి సంబంధించి 8797 మందికి 1513.52 కోట్ల ఇందిరా మహిళా శక్తి బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా 202324 మరియు 202425 సంవత్సరాలకు గాను 11002 మందికి 40.09 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలను అందించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, కె.వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్లు పట్లోల నీరజ బాల్ రెడ్డి, కుందుమళ్ళ రజిత, జిల్లా, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఫ్యాక్టరీలో ప్రమాదం..కార్మికుడికి తీవ్ర గాయాలు

- **కార్మికుడి కాలిపై పడిన ఇనుప పరికరాలు.. తెగిపడిన కాలు**
- **భద్రతా లోపాలపై కంపెనీపై ఫిర్యాదు**

**కుత్బుల్లాపూర్, మే 22(ప్రజాక్షేత్రం):**





జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్ రెడ్డి నగర్‌లో ఉన్న ఓ స్ట్రక్చర్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన వెలుగులోకి వచ్చింది. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితురాలు గోసుల పద్మావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె భర్త గోసుల రామకృష్ణ ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో మామూత్ స్ట్రక్చర్ కంపెనీలో క్రేన్ సహాయంతో ఐరన్ బీమ్‌లు ఎత్తుతున్న సమయంలో ప్రమాదవశాత్తు భారీ ఐరన్ బీమ్ ఆయన కాలిపై పడింది.

ఈ ప్రమాదంలో రామకృష్ణ కాలుకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే సహచరులు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం షాపూర్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం, సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీడిమెట్ల పోలీసులు తెలిపారు.



# ప్రమాద బాధితుడికి బి.కే.ఆర్ ఫౌండేషన్ చేయూత

- **ఆపదలో ఉన్నవారికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం:కిషోర్ రెడ్డి**
- **సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న బి.కే.ఆర్ ఫౌండేషన్**

**కుత్బుల్లాపూర్, మే 22(ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296వ డివిజన్ దుండిగల్‌కు చెందిన కే. అశోక్ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి వైద్య చికిత్స కోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్టేట్ ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ..బికేఆర్ ఫౌండేషన్ ద్వారా ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తామని తెలిపారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తమ ఫౌండేషన్ ద్వారా భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు కోల్పోయిన అశోక్ పరిస్థితిపై స్పందించి వెంటనే సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు కిషోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, దొంతి మహేష్, కృష్ణ యాదవ్‌తో పాటు బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# నీటి ట్యాంక్ దుస్థితి.. పట్టించుకోని అధికారులు

- **భగీరథ నీటిపై సందేహాలు**
- **కొత్త ట్యాంక్ కోరుతున్న ప్రజలు**

**పెద్దకొడప్‌గల్ మే 22(ప్రజాక్షేత్రం):**



మండల కేంద్రంలోని చౌకదారుల దుకాణం ఎదుట ఉన్న నీటి ట్యాంక్ శిధిలావస్థకు చేరుకుంది. ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు వెళ్లే సఫాయ్ కార్మికులు కూలిపోతుందేమోనని భయపడుతున్నారు. మిషన్ భగీరథ నీరు ఇదే ట్యాంక్ నుంచి సరఫరా అవుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి కొత్త ట్యాంక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

- **తెగిన వైరు బలి తీసుకున్న ఎద్దు**
- **రైతుకు రూ.80 వేల నష్టం**
- **పరిహారం ఇవ్వాలని రైతు ఆవేదన**

**పెద్దకొడప్‌గల్, మే 22(ప్రజాక్షేత్రం):**



పెద్ద కొడప్‌గల్ మండలం బాబుల్గావ్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని విద్యుత్ స్తంభం నుంచి తెగిపడిన విద్యుత్ వైరు తగలడంతో ఒక ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో పశువుల యజమాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన ఎద్దు చింతలవాడి తండాకు చెందిన సుద్రాన్ యాదవరావు (నర్సింగరావు కుమారుడు)కు చెందినదిగా స్థానికులు తెలిపారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే ఈ ఎద్దు మృతి చెందడంతో రైతుకు సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు.ఘటన విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే స్పందించి వెటర్నరీ శాఖ, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. పంచనామా నిర్వహించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ షాక్ కారణంగా పశువు మృతి చెందిన నేపథ్యంలో బాధిత రైతుకు ఎక్స్‌గ్రేషియా మరియు బీమా పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. గ్రామంలో తరచూ విద్యుత్ వైర్లు తెగిపడుతున్నాయని, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# పదవ తరగతి విద్యా ఫలితాల్లో వనపర్తి

- రాష్ట్ర స్థాయిలో 28వ స్థానం నుంచి 19వ స్థానానికి
- వచ్చే విద్యా సంవత్సరంలో 100% ఫలితాలు సాధించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, మే 22(ప్రజాక్షేత్రం):**

విద్యార్థులు కష్టాలను అధిగమించి ఉన్నత విద్యతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక - విద్యా విజయోత్సవాలు' కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కూడా సత్కరించారు. 80 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి అత్యుత్తమ మార్కులు సాధించిన 80 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ చేతుల మీదుగా వారికి ప్రశంసాపత్రాలు అందించారు.

**11 మందికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి**

పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులు అందజేశారు.

**97 శాతానికి పెరిగిన పదో తరగతి ఫలితాలు**

గతేడాది పదో తరగతి ఫలితాల్లో వనపర్తి జిల్లాలో 90 శాతం ఉత్తీర్ణత నమోదైందని, ఈ ఏడాది అది 97 శాతానికి పెరిగిందని కలెక్టర్ తెలిపారు. దీంతో రాష్ట్ర స్థాయిలో జిల్లా ర్యాంకు 28వ స్థానం నుంచి 19వ స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

**ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు ఉండాలి**

జిల్లాలో ఒక్క పాఠశాల కూడా మరుగుదొడ్లు లేకుండా ఉండకూడదని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాఠశాలలో అవసరమైన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు కావడానికి జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఇప్పటికే ఎల్పీజీ కనెక్షన్లు అందించినట్లు తెలిపారు.

**'ఇగ్నైటెడ్ మైండ్స్' చదవాలి**

వెనకబడిన విద్యార్థుల అభ్యాసానికి కృత్రిమ మేధా సాంకేతికతను ఉపయోగించి పాఠశాలల్లో బోధన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇగ్నిటెడ్ మైండ్స్ పుస్తకాన్ని అందజేసి ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నరేంద్ర కుమార్, ఇతర అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## జాదవ రావులపల్లి రైస్ మిల్లు పరిశీలించిన తహసిల్దార్.



**మద్దూరు మే 22(ప్రజాక్షేత్రం):**

మద్దూరు మండలం జాదవ రావులపల్లి లోని రైస్ మిల్లును తహసిల్దార్ మహేష్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ సంయుక్తంగా పరిశీలించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వేగంగా అన్లోడ్ చేసి మిల్లింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని రైస్ మిల్ యజమానికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి ట్రాక్టర్ లారీలను త్వరగా అన్లోడ్ చేయాలని ఆదేశించారు.



## వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- పెద్దేముల్ మండల కేంద్రంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న వీఓఏలు

**పెద్దేముల్, మే 22 (ప్రజాక్షేత్రం):**

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని పెద్దేముల్ మండల వీఓఏల సంఘం అధ్యక్షురాలు భ్యాగ్యలక్ష్మి,కార్యదర్శి అనంతయ్యలు అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య ఆవరణలో తోటి వీఓఏలతో కలిసి నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ స్థాయిలో సేవలు అందిస్తున్న వీఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు తదితర డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ మండల వీఓఏల సంఘం కోశాధికారి కృష్ణయ్య, సలహాదారులు జగ్గప్ప, లక్ష్మి, నరేష్, అశోక్‌తో పాటు ఆయా గ్రామ సంఘాలకు చెందిన వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ చైర్మన్ పదవికి ఆకస్మికంగా రాజీనామా చేసిన ఆకునూరి మురళి

- నాలుగు నెలల పదవీకాలం మిగిలి ఉండగానే కీలక నిర్ణయం

**హైద్రాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ విద్యా వర్గాలు, రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసేలా విద్యా కమిషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఇంకా నాలుగు నెలల పదవీకాలం మిగిలి ఉండగానే ఆయన తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయన రాజీనామా వెనుక గల కారణాలపై వివిధ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి కారణమా..? లేక వ్యక్తిగత కారణాల వల్లనా..? అనే అంశాలపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా చర్చించుకుంటున్నాయి. ఆకునూరి మురళి రాజీనామాతో విద్యా కమిషన్ భవిష్యత్‌పై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. త్వరలోనే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాధికారి

**ఆత్మకూర్ మే 22(ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లాలో అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీ వాణి హై స్కూల్ ఆత్మకూర్ విద్యార్థులు సి.దీప్తి (579/600) ఎస్.కె.బోజుడు (575/600) విద్యార్థులను సత్కరించి, సర్టిఫికెట్ బహుమతి ప్రధానోత్సవంతో అభినందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని శుక్రవారం వనపర్తి జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో విద్యా వారోత్సవాలు 2026,విద్యా విజయోత్సవ కార్యక్రమంలో ఎస్ఎస్సి 2026 ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన జిల్లా, మండల టాపర్ లను సత్కరిస్తూ, అభినందించిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాధికారి. ఈ సందర్భంగా శ్రీ వాణి హై స్కూల్ ఆత్మకూరు విద్యార్థులు సి.దీప్తి (579/600),..ఎస్.కె.బోజుడు (575/600) విద్యార్థులను జిల్లాలో అత్యుత్తమ మార్కులు సాధించినందుకుగాను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని విద్యార్థులను సత్కరించి, సర్టిఫికెట్ బహుమతి ప్రధానోత్సవంతో అభినందించారు. కార్యక్రమంలో నరేంద్ర కుమార్ (డిఐఈఓ), మదిలేటి (డిసిఇబి), గణేష్ కుమార్ (ఎసిఇజి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ మార్కులు సాధించిన శ్రీ వాణి హై స్కూల్ విద్యార్థులను, సహకరించిన పాఠశాల అడ్వైజర్ టి.జె విశ్వేశ్వర్, ప్రిన్సిపల్ లతా మరియు గంగాధర్, ఉపాధ్యాయులను మరియు విద్యార్థుల తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు వారందరికీ అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.



## 19 ప్లాట్లు, 2 ఎకరాల్లో ఫామ్ హౌస్... మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్టు

- ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా 11 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు
- బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు
- వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ప్లాట్లు గుర్తింపు
- రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించిన అధికారులు

**హైదరాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**

మేడ్చల్ మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. ఈరోజు ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మరో 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో వంశీమోహన్‌కు సంబంధించిన భారీగా ఆస్తులను గుర్తించారు. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో వంశీమోహన్ ఆర్డీవోగా పనిచేశారు. ఆర్డీవోగా పని చేసిన సమయంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిర్జీపురంలో ఎనిమిది ఎకరాలు ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. భూములను తొలుత తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.



## హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు అధిక డిమాండ్..

- నిల్వ కోసం ముందస్తు బుకింగ్!
- అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నగర ప్రజలు
- గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి భారీగా పెరిగిన ట్యాంకర్ బుకింగ్‌లు
- ఈ సంవత్సరం మే 20వ తేదీ నాటికి 2.60 లక్షల ట్యాంకర్ల నీటి సరఫరా

**హైదరాబాద్ మే 22(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ నగరంలో ప్రజలు అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతకు తోడు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. భానుడి భగభగ కారణంగా నగరంలో తాగునీటి వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో జలమండలి నీళ్ల ట్యాంకులకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు. నగరంలో మే నెల మొదటి 20 రోజుల్లో సుమారు 2.60 లక్షల ట్యాంకర్ల నీటిని సరఫరా చేసినట్లు జలమండలి తెలిపింది. ప్రస్తుతం వారం రోజులుగా రోజుకు సగటున 12 వేలకు పైగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో ఎక్కువ ట్యాంకర్లకు డిమాండ్ ఉండేది. మే నెలలో కాస్త తగ్గేది. కానీ ఈసారి ఇందుకు భిన్నంగా మే నెలలో ఎక్కువ ట్యాంకుల కోసం బుక్ చేసుకున్నారు. గత సంవత్సరం మే నెలలో మొదటి 20 రోజుల్లో 1.69 లక్షల నీటి ట్యాంకర్లకు డిమాండ్ ఉండగా, ఈసారి 2.60 లక్షల ట్యాంకర్లతో నీటి సరఫరా జరిగింది. వర్షాలు పడి, వాతావరణం కాస్త చల్లబడేవరకు నీటి ట్యాంకర్ల బుకింగ్ ఇదే విధంగా ఉండవచ్చని భావిస్తున్నారు. గత మూడేళ్లను పరిశీలిస్తే 2024 మే 20వ తేదీ నాటికి 1,18,191 ట్యాంకర్లు, 2025 అదే కాలంలో 1,69,347 ట్యాంకర్లు నీటిని సరఫరా జరింది. పెట్రోల్, డీజిల్ కొరత ఆందోళనలు తలెత్తినప్పుడు వాహనదారులు బంకుల వద్ద క్యూకట్టి ముందస్తుగా భద్రపరుచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల గ్యాస్ సిలిండర్ కొరత భయాలతోనూ ప్రజలు గ్యాస్ కోసం వేగంగా బుకింగ్ చేసి, ఇంట్లో భద్రపరుచుకున్నారు. అదనపు గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేయడంతో అవసరమైన వారికి దొరకకుండా పోయింది. ఇప్పుడు ఇదే కోవలో హైదరాబాద్‌లో నీటిని కూడా ముందస్తుగా బుకింగ్ చేసి భద్రపరుచుకుంటున్నారు. కొంతమంది అవసరం లేకపోయినా ట్యాంకర్లను బుక్ చేసుకుని నీటిని నిల్వ చేసుకుంటున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది నీటి కొరత, ట్యాంకర్ల బుకింగ్‌లో అత్యధికస్థాయికి చేరుకున్నాయి.



## వికారాబాద్‌లో అర్ధరాత్రి ఆపరేషన్.. రోడ్డుపైకి ఎస్పీ!

**వికారాబాద్ బ్యూరో 22(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో శుక్రవారం సాయంత్రం 7 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన కూడళ్లు, చౌరస్తాలు మరియు ప్రధాన రహదారుల వద్ద ఏకకాలంలో డ్రంక్ & డ్రైవ్ తనిఖీలు మరియు నకబందీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా మరియు అలంపల్లి చౌరస్తాలలో జిల్లా ఎస్పీ ఆకస్మికంగా వాహనాల తనిఖీలను పరిశీలించి, విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు పలు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. గుట్టుగా.. నివాస గృహంలోనే రీఫిల్లింగ్ కేంద్రం ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమశిక్షణ పరిరక్షణ, అక్రమ రవాణా అరికట్టడం మరియు డ్రంక్ & డ్రైవ్ కేసులను తగ్గించడమే లక్ష్యంగా నకబందీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనుమానాస్పద వాహనాలు, వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నిరపరాధుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
23.05.2026
శనివారం | హైదరాబాద్



## రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు రికార్డు

- రెండేళ్లలో 150 కేసుల్లో నిందితులకు శిక్షలు
- బాధితులకు పునరావాసం కోసం రూ.3 కోట్ల వరకు నష్టపరిహారం
- బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా న్యాయ సేవాధికార సంస్థకు ఆదేశాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు సరికొత్త రికార్డును సృష్టించింది. చిన్నారులపై జరిగిన 150 లైంగిక వేధింపుల కేసుల్లో నిందితులకు శిక్షలు విధించింది. కేవలం రెండేళ్ల వ్యవధిలోనే వారికి శిక్షలు విధించడం గమనార్హం. పోక్సో చట్టం 2012 కింద నమోదవుతున్న కేసులను త్వరితగతిన విచారించేందుకు ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశారు. గత రెండేళ్లుగా ఈ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసుల విచారణలో వేగం పెరిగింది. పోక్సో కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం జరగడంతో శిక్షలు, జరిమానాలు కూడా విధిస్తున్నారు. బాధితుల పునరావాసం కోసం అన్ని కేసుల్లో కలిపి దాదాపు రూ.3 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని మంజూరు చేశారు. ఈ పరిహారం కూడా బాధితులకు త్వరగా అందేలా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తోంది. రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో ఫాస్ట్ ట్రాక్ కోర్టు గత రెండేళ్ల కేసులను పరిశీలిస్తే, 10 కేసుల్లో నిందితులకు తుదిశ్వాస విడిచే వరకు శిక్షపడగా, 15 కేసుల్లో యావజ్జీవ శిక్షలు ఖరారయ్యాయి. మరో 35 కేసుల్లో ఇరవై ఏళ్ల కారాగార శిక్ష, 17 కేసుల్లో 14 ఏళ్ళ కారాగార శిక్ష విధించింది. ఏడేళ్లు, ఐదేళ్ళు, మూడేళ్ళు, రెండేళ్లు, ఏడాది జైలు శిక్షలు పడిన కేసులు కూడా ఉన్నాయి.

## గర్భం దాల్చిన పదో తరగతి అమ్మాయి...

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- రంగారెడ్డి జిల్లా మేడిగడ్డ గ్రామంలో ఘటన
- ఇటీవలే పదో తరగతి పూర్తి చేసిన గిరిజన బాలిక
- సొంత గ్రామానికి చెందిన యువకుడి కారణంగా గర్భం దాల్చిన వైనం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 22(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో పదో తరగతి చదివిన ఒక మైనర్ గిరిజన విద్యార్థిని గర్భం దాల్చిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. బాధితురాలు ఆమనగల్లు మండలంలోని మేడిగడ్డ గ్రామానికి చెందిన గిరిజన బాలిక. ఆమె ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదో తరగతి పూర్తి చేసింది. పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలైన అనంతరం, సదరు బాలిక ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతి అనే విషయం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడి కారణంగా ఆమె గర్భం దాల్చించి. ఈ విషయం బయటకు రావడంతో గ్రామంలోని కుల పెద్దలు మొదట పంచాయితీ సైతం నిర్వహించినట్లు సమాచారం.
అయితే, మైనర్ బాలిక గర్భం దాల్చిన ఉదంతంపై సమాచారం అందగానే పోలీసులు రంగంలోకి దిగారు. బాలిక మైనర్ కావడంతో నిందితుడిపై కఠినమైన పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. బాధితురాలైన బాలికకు రక్షణ, వైద్య సంరక్షణ కల్పించేందుకు గాను అధికారులు ఆమెను హైదరాబాద్‌లోని ప్రభుత్వ కేర్ టేకర్ హోమ్‌కు (ప్రభుత్వ రక్షణ కేంద్రానికి) తరలించారు. పోలీసులు ఈ కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు జరుపుతున్నారు.



# ప్రజల అర్జీలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలి

- బాధ్యతాయుతంగా పరిష్కరిస్తేనే ప్రజాపాలనకు నిజమైన అర్థం
- మంత్రి జూపల్లి కృష్ణా రావు
- వనపర్తిలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి వెల్లడి

**వనపర్తి, మే 22(ప్రజాక్షేత్రం):**

ప్రజల అర్జీలను అధికారులు బాధ్యతాయుతంగా, సత్వరంగా పరిష్కరించి న్యాయం చేయాలని, అదే ప్రజాపాలనకు అసలైన అర్థమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.
శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆయన స్థానిక శాసనసభ్యులు మెగారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా తదితరులతో కలిసిపాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు.

**దళారీ వ్యవస్థకు ముగింపు**

ప్రజల అర్జీల పరిష్కారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వద్దని మంత్రి జూపల్లి అధికారులకు స్పష్టం చేశారు. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూభారతి సంబంధిత రైతుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని మంత్రి కృష్ణారావు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ప్రభుత్వ పరిమితుల్లోనే ఇళ్లు నిర్మించుకోవాలని, అధిక వ్యయంతో మళ్లీ అప్పుల పాలవకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై ప్రతి కుటుంబానికి సరైన సమాచారం చేరాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్య, వైద్యానికి ప్రాధాన్యం**

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు. సమైక్య రాష్ట్రంలో 65 ఏళ్లలో రూ.65 వేల కోట్ల అప్పు ఉండగా, గత ప్రభుత్వం పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని కోరారు. యువత డ్రగ్స్ వైపు కాకుండా క్రీడల వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు.

**రెండున్నరేళ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు**

ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తుతో పేదలపై భారం తగ్గిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని, ప్రస్తుతం జిల్లాలో 73 వేలకుపైగా కొత్త కార్డులు జారీ చేశామని పేర్కొన్నారు. రైతులకు పెరిగిన పెట్టుబడి సాయం రైతు భరోసా కింద గతంలో ఎకరాకు రూ.10 వేల సాయం అందించగా, ప్రస్తుతం దానిని రూ.12 వేలుకు పెంచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 15 బస్సులు కొనుగోలు చేసి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామన్నారు.

**వనపర్తిలో భారీ అభివృద్ధి పనులు**

వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే:

**రూ.70 కోట్లతో తాగునీటి పనులు**

రూ.47 కోట్లతో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలు
రూ.5 కోట్లతో జిల్లా సమాఖ్య భవనం రూ.203 కోట్లతో నూతన జిల్లా ఆసుపత్రి నిర్మాణం
యూనియన్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో జిల్లా ఆసుపత్రిలో రూ.2.5 కోట్ల సిటీ స్కాన్ ఏర్పాటు పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.





**జిల్లాలో సంక్షేమ పథకాల అమలు**

జిల్లాలో 61,687 మంది రైతులకు రూ.491 కోట్ల రైతు రుణమాఫీ లబ్ధి చేకూరిందన్నారు. రైతు భరోసా కింద 1.83 లక్షల మందికి రూ.140 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు తెలిపారు. 84,830 మంది లబ్ధిదారులకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, 6,094 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. 8,258 స్వయం సహాయక సంఘాలకు రూ.28 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

**చిన్నారులకు వినికిడి పరికరాలు**

బాల భరోసా కార్యక్రమం కింద 16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి బస్సులను అందజేశారు. రైతులకు పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ఫోటో ప్రదర్శనలను ముఖ్య అతిథులు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు ఆంక్షల్లేని పెన్షన్ ఇవ్వాలి

- ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 22(ప్రజాక్షేత్రం) :**

ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన బీడీ కార్మికులందరికీ 'చేయూత' పథకం కింద నెలకు రూ.4 వేల పింఛను వెంటనే మంజూరు చేయాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. రుద్రూర్ మండల కేంద్రంలో యూనియన్ బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంగడి బజారు నుంచి సమీకృత మండల కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మల్లేష్ మాట్లాడుతూ.. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు తక్షణమే నాలుగు వేల రూపాయల పింఛన్ అందించాలన్నారు. వచ్చే జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్త పెన్షన్లు ఇస్తామని మంత్రులు ప్రకటనలు చేస్తున్నారని, ఈ ప్రక్రియలో కట్ ఆఫ్ డేట్ నిబంధనను పూర్తిగా తొలగించి కార్మికులందరికీ న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో బీడీ కార్మికులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్చార్జి అధికారికి అందజేశారు. అయితే, అధికారులు కార్మికుల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను స్వీకరించేందుకు నిరాకరించడంతో ఆగ్రహించిన కార్మికులు సమీకృత మండల భవన సముదాయంలోనే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ బోధన్ ఏరియా కమిటీ నాయకులు శోభ, బుజ్జి, లతా, శంకరమ్మ, లక్ష్మీ, గంగామణి, కార్మికులు పాల్గొన్నారు.




## భారత్‌లో ఈబైక్‌ల జోరు.. రికార్డు స్థాయిలో 14 లక్షల రిజిస్ట్రేషన్లు

- 2026 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 14 లక్షల ఈ-టూవీలర్ల రిజిస్ట్రేషన్లు
- గత ఏడాదితో పోలిస్తే 22 శాతం పెరిగిన అమ్మకాలు
- అగ్రస్థానంలో టీవీఎస్ మోటార్, తర్వాతి స్థానాల్లో బజాజ్, ఏథర్
- ప్రభుత్వ సబ్సిడీలు, పెరిగిన ఇంధన ధరలతో పెరిగిన డిమాండ్
- మొత్తం ఈవీ రిజిస్ట్రేషన్లలో 60 శాతం వాటా ద్విచక్ర వాహనాలదే



**నేషనల్ బ్యూరో మే 22(ప్రజాక్షేత్రం):**

భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ టూవీలర్ (ఈటూవీలర్) సెగ్మెంట్ కొత్త రికార్డులు సృష్టిస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఏకంగా 14 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈ గణాంకాలను వాహన్ పోర్టల్ డేటా ఆధారంగా స్టాటిస్టా సంస్థ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన 12 లక్షల యూనిట్లతో పోలిస్తే ఇది 22 శాతం అధికం. దేశంలో అమ్ముడవుతున్న మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల్లో దాదాపు 10లో 6 వాహనాలు ఎలక్ట్రిక్ టూవీలర్లే కావడం గమనార్హం. 202526 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వాహన రిజిస్ట్రేషన్లలో ఈటూవీలర్ల వాటా 6.5 శాతంగా నమోదైంది. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ కంపెనీ 3,41,513 యూనిట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత బజాజ్ ఆటో (2,89,349 యూనిట్లు), ఏథర్ ఎనర్జీ (2,39,178 యూనిట్లు) ఉన్నాయి. 2026 మార్చిలో రిజిస్ట్రేషన్లు రికార్డు స్థాయికి చేరడం ఈ వృద్ధికి దోహదపడింది. పీఎం ఈడ్రైవ్ పథకం కింద సబ్సిడీలను 2026 జులై 31 వరకు పొడిగించడం, అధిక ఇంధన ధరలు అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ జోరు కొనసాగుతోంది. 2026 ఏప్రిల్ లో 1,48,740 ఈటూవీలర్లు రిజిస్టర్ కాగా, ఇది గతేడాదితో పోలిస్తే 61 శాతం పెరుగుదల. మే మధ్య నాటికి వెలువడిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, మార్కెట్‌లో టీవీఎస్ 25 శాతం వాటాను కలిగి ఉండగా, బజాజ్ 23 శాతంతో గట్టి పోటీ ఇస్తోంది. విశాలమైన పంపిణీ నెట్‌వర్క్‌లు ఉన్న ప్రముఖ తయారీదారులు ఈ పోటీలో మార్కెట్ వాటాను పెంచుకుంటున్నారని పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్నారు. తక్కువ ఖర్చు, పర్యావరణ అనుకూల రవాణాకు వినియోగదారులు మొగ్గుచూపడం, ప్రభుత్వ విధానాలు కలిసి భారతదేశ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణంలో ఈస్కూటర్లు, మోటార్‌సైకిళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.




## పేరెంట్స్ ఐఏఎస్‌లు అయ్యాక పిల్లలకు రిజర్వేషన్ ఎందుకు..

- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
- ఐఏఎస్ అధికారుల పిల్లలకు రిజర్వేషన్లపై ప్రశ్నలు
- విద్యా, ఆర్థిక ఎదుగుదలతో సామాజిక మార్పు
- రిజర్వేషన్ల నుంచి తరం మారాలని సూచన
- క్రీమీ లేయర్ మినహాయింపులపై కోర్టు విచారణ
- ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నవారికి కోటాపై అసంతృప్తి

**నేషనల్ బ్యూరో మే 22(ప్రజాక్షేత్రం):**

రిజర్వేషన్ల ప్రయోజనాలు పొంది విద్యాపరంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలకు ఇంకా కోటా ఎందుకని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. వెనుకబడిన తరగతుల్లోని 'క్రీమీ లేయర్' మినహాయింపులపై దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. సమాజంలో ఒకసారి ఆర్థిక, సామాజిక ఎదుగుదల వచ్చాక కూడా మళ్లీ రిజర్వేషన్లు కోరడాన్ని కోర్టు తప్పుబట్టింది.
"తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయితే, వారి పిల్లలకు ఇంకా రిజర్వేషన్లు ఎందుకు? విద్యాపరమైన, ఆర్థికపరమైన సాధికారత వచ్చినప్పుడు సమాజంలో హోదా దానంతట అదే మారుతుంది. ఒకసారి విద్యా, ఆర్థిక ఎదుగుదల ద్వారా సామాజిక మార్పు వచ్చాక.. మళ్లీ వారి పిల్లలు కూడా రిజర్వేషన్లు కోరితే ఈ వ్యవస్థ నుంచి మనం ఎప్పటికీ బయటపడలేం. ఉన్నత స్థాయికి చేరిన వారిని కోటా ప్రయోజనాల నుంచి మినహాయిస్తూ ఇప్పటికే పలు ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయి" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.
"విద్యార్థుల తల్లిదండ్రులు మంచి ఉద్యోగాల్లో ఉంటూ, మంచి ఆదాయం సంపాదిస్తున్నా.. వారి పిల్లలు మళ్లీ రిజర్వేషన్లు కావాలంటున్నారు. నిజానికి వారు రిజర్వేషన్ల పరిధి నుంచి బయటకు రావాలి. రిజర్వేషన్ల వల్ల ఒక తరం ఉన్నత స్థాయికి చేరుకున్నాక తదుపరి తరం అర్హతలపై కచ్చితంగా సమీక్ష జరగాలి. అప్పుడే సమాజంలో సమతుల్యత ఉంటుంది" అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.

**ఈడబ్ల్యూఎస్ కోటాపై వివరణ**

ఇదే సమయంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లపై కూడా కోర్టు మాట్లాడింది. "ఈడబ్ల్యూఎస్ కోటా అనేది కేవలం ఆర్థిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చేది. అందులో సామాజిక వెనుకబాటుతనం అనే కోణం ఉండదు" అని జస్టిస్ నాగరత్న వివరించారు. ఈ మొత్తం వ్యవహారంపై స్పందించాల్సిందిగా కోరుతూ సుప్రీంకోర్టు సంబంధిత పక్షాలన్నింటికీ నోటీసులు జారీ చేసింది.



# ఏడ్చి ఏడ్చి విసిగిపోయా, ఇక నోరు మూసుకునేది లేదు



నటీనటుల క్యారెక్టర్‌ను కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిపై యాంకర్, నటి విష్ణుప్రియ భీమనేని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నిరంతరం తప్పుడు ప్రచారం చేస్తూ, అసభ్యకరంగా మాట్లాడుతున్న 'ప్లే లైక్ ఇంకాగ్నిటో' అనే యూట్యూబ్ ఛానల్‌పై ఆమె హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ (FIR) నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారని ఆమె అన్నారు.విష్ణుప్రియ భీమనేని మాట్లాడుతూ "మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాము, ఎఫ్ఐఆర్ నమోదైంది. యాక్షన్ తీసుకోబోతున్నారు. వి ఆర్ సో గ్రేట్‌ఫుల్!. 'ఇంకాగ్నిటో' అనే YouTube ఛానల్ ఉంది. తను ఒక అమ్మాయి అయ్యుండి, వేరే ప్రతి సెలబ్రిటీ అమ్మాయిల మీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతుంది. అందుకే నేను ఆమె మీద ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి అనుకున్నా, తనే కాదు, ఇంకా చాలా మంది ఉన్నారు. వాళ్ళందరికీ కూడా ఇది ఒక ఇన్ఫర్మేషన్‌గా చెప్తున్నాను; మీరు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే మీ ఛానల్ మీద స్ట్రైక్ పడేటట్టు, మీ మీద ఖచ్చితంగా చర్యలు తీసుకునేటట్టు చేస్తాం. ఎప్పుడో యాక్షన్ తీసుకోవాలి, కానీ చాలా రోజులు వెయిట్ చేసి, చాలా నిందల తర్వాత, చాలా నెగిటివ్ బ్యాడ్ పబ్లిసిటీ, రాంగ్ పబ్లిసిటీ, రాంగ్ ఇన్ఫర్మేషన్ అది కరెక్ట్ ఇన్ఫర్మేషన్ లాగా రాంగ్ ఇన్ఫర్మేషన్ ఆడియన్స్‌కి ప్రాజెక్ట్ చేస్తున్నందుకు, కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో అలా రాంగ్‌గా చేస్తున్న వాళ్ళ మీద ఈ కంప్లైంట్. మేము ఈ ఎంటర్టైన్మెంట్ ఫీల్డ్‌కి వచ్చింది జనాల్ని ఎంటర్టైన్ చేయడానికి, ఆనందపరచడానికి. వాళ్ళు ఉన్న బాధల్లో ఒక ఫైవ్ మినిట్స్ గానీ, 10 మినిట్స్ గానీ మా కంటెంట్ చూసి వాళ్ళు ఎంజాయ్ చేయాలని. నిజంగా తప్పులైనప్పుడు నిందించండి, ఖండించండి; తలదించుకుని ఎన్నైనా మాటలు పడతాము. తప్పు కానివి క్యారెక్టర్ అస్సాసినేట్ చేస్తూ, "డబ్బుల కోసం శరీరం అమ్ముకుంటుంది" ఇలాంటి వర్డ్స్.. అది కూడా కొంతమంది పెద్ద పెద్ద వాళ్ళు మాట్లాడుతున్నారు పెద్ద పెద్ద ఛానల్స్ లో! ఓకే ఫైన్. ఇంకా ఎన్ని రోజులు ఇలా నోరు మూసుకొని ఉంటాను? ఒక్కసారైనా నాకోసం నేను నించోని.. నాకోసమే కాదు, ఇంకా వేరే ఏ ఆడపిల్లల గురించి ఎలా పడితే అలా, ఎవరు పడితే ఎవరైనా మాట్లాడకూడదని ఈ డెసిషన్ తీసుకుంటున్నాను. ప్రస్తుతానికి అయితే ఒక్కరితో స్టార్ట్ చేశాము. ఇక ముందు ఎవరు ఇలా చేసినా మీ ఛానల్స్ మీద స్ట్రైక్స్ పడేలా, కఠిన చర్యలు తీసుకునేలా ముందుకు వెళ్తాం" అని విష్ణుప్రియ హెచ్చరించారు.

# మోసం చేస్తే వదిలేస్తా

టాలీవుడ్ ఒకప్పటి స్టార్ హీరోయిన్, పంజాబీ ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానీ (Jackky Bhagnani) ని వివాహం చేసుకుని హ్యాపీగా లైఫ్ లీడ్ చేస్తున్న రకుల్.. తాజాగా తన కొత్త సినిమా ప్రమోషన్స్ ఇంటర్వ్యూలో 'రిలేషన్‌షిప్స్ & మోసం' (Cheating) పై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఓ యూట్యూబ్ టాక్ షోలో ఆయుష్మాన్ ఖొరానా, సారా అలీఖాన్, రకుల్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంధాలు, మోసాల గురించి ఆసక్తికర చర్చ జరిగింది. ఇందులో ముందుగా రిలేషన్‌లో ఏదైనా పొరపాటు జరిగినప్పుడు నిజాయితీగా క్షమాపణ చెబితే క్షమించేయాలని, మనమంతా మనుషులమే కాబట్టి పొరపాట్లు సహజమని ఆయుష్మాన్ పేర్కొన్నారు. అలాగే ఒక్కసారి పొరపాటున మోసం చేస్తే క్షమించవచ్చా? అని సారా అడగ్గా.. రకుల్ తొలుత 'ఓకే' అంది. కానీ, వెంటనే స్పందిస్తూ.. 'ఒక్కసారి తప్పు చేస్తే క్షమించొచ్చు, కానీ దాన్నే అలవాటుగా (Habit) మార్చుకుని పదే పదే మోసం చేస్తూ ఉంటే మాత్రం నేను అస్సలు ఊరుకోను, సహించను' అని చాలా ఖచ్చితంగా తేల్చి చెప్పింది. తన వ్యాఖ్యలు పర్సనల్ లైఫ్‌కు ముడిపెట్టి వివాదంగా మారుతాయని గ్రహించిన రకుల్.. ఇంటర్వ్యూలోనే వెంటనే .. 'నేను చెప్పిన అభిప్రాయం కేవలం సాధారణమైనది మాత్రమే. ఇది నాకు, నా భర్త జాకీ భగ్నానీకి అస్సలు వర్తించదు. దయచేసి దీనిపై ఎలాంటి తప్పుడు వార్తలు, గాసిప్స్ సృష్టించొద్దు' అని క్లారిటీ ఇచ్చింది.




# తమిళ మాస్ డైరెక్టర్‌తో.. చైతూ కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్..!



యువసామ్రాట్ నాగచైతన్య (Naga Chaitanya) ప్రస్తుతం తన కెరీర్‌లోనే బెస్ట్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో వచ్చిన 'తండేల్' (Thandel) చిత్రంతో తన కెరీర్‌లోనే మొదటిసారి రూ. 100 కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టి సాలిడ్ కంబ్యాక్ ఇచ్చారు. ప్రస్తుతం కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' (Vrushakarma) అనే మైథలాజికల్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో నటిస్తూ బిజీగా ఉన్న చై.. తన తదుపరి చిత్రం కోసం ఒక సీనియర్ తమిళ దర్శకుడితో చర్చలు జరుపుతున్నట్లు ఫిలింనగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త హల్‌చల్ చేస్తోంది.

గతంలో 'పందెం కోడి', 'ఆవారా' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన కోలీవుడ్ మాస్ డైరెక్టర్ లింగుస్వామి (Lingusamy) దర్శకత్వంలో నాగచైతన్య తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేస్తున్నట్లు గట్టిగా టాక్ వినిపిస్తోంది. అయితే, ఈ కాంబినేషన్ వార్త అక్కినేని అభిమానుల్లో తీవ్ర చర్చకు, కొంత ఆందోళనకు దారితీసింది. ఎందుకంటే ఒకప్పుడు బ్లాక్‌బస్టర్ హిట్స్ ఇచ్చిన లింగుస్వామి ట్రాక్ రికార్డ్ ఇటీవల ఆశించిన స్థాయిలో లేదు. రామ్ పోతినేనితో ఆయన తెలుగు, తమిళ భాషల్లో భారీ అంచనాలతో తెరకెక్కించిన 'ది వారియర్' (The Warriorr) చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. గతంలో నాగచైతన్య మరో తమిళ స్టార్ డైరెక్టర్ వెంకట్ ప్రభు నమ్మి చేసిన 'కస్టడీ' (Custody) సినిమా కూడా ప్రేక్షకులను మెప్పించలేకపోయింది.

దీంతో మళ్లీ ఫామ్‌లో లేని తమిళ దర్శకుడితో రిస్క్ చేయడం అవసరమా? 'తండేల్' తెచ్చిన వంద కోట్ల మార్కెట్‌ను చైతన్య కాపాడుకోవాలి కదా? అంటూ కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వార్తలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మరి ఈ క్రేజీ కాంబినేషన్ కేవలం రూమర్‌గానే మిగిలిపోతుందా లేక నిజంగానే నాగచైతన్య, లింగుస్వామికి లైన్ ఇస్తారా అనేది తెలియాలంటే కొద్దిరోజులు ఆగాల్సిందే!




# 'పెద్ది'పై హైప్రెజర్ ?


విడుదలకు ముందే ఇప్పుడు భారీ హైప్ క్రియేట్ చేస్తున్న సినిమా 'పెద్ది'. కానీ, ఈ హైప్ మొత్తం నిజంగానే కథ, మేకింగ్ వల్ల వచ్చిందా? లేక రామ్ చరణ్ చేసిన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ వల్ల పెరిగిందా? నిజమైన పెహల్వాన్లతో షూటింగ్ చేయడం వెనుక అసలు కారణం ఏంటి? షూటింగ్ సమయంలో ఆర్టిస్టుల నుంచి నాచురల్ ఎమోషన్స్ రావడానికి దర్శకుడు బుచ్చిబాబు ఎలాంటి పద్ధతులు ఫాలో అయ్యాడో ఇప్పుడు చూద్దాం. 'పెద్ది' రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్దీ ఆ సినిమాపై హైప్ కూడా భారీగానే పెరుగుతోంది. ప్రమోషన్స్ బాధ్యత చరణ్, బుచ్చిబాబు ఇద్దరే తీసుకున్నారా అనే టాక్ కూడా ఒకవైపు వినిపిస్తోంది. అందులో భాగంగానే 'A Driving Through Peddi Memories' వీడియో రిలీజ్ అయింది.

'పెద్ది' కథ మొదట వినగానే రామ్ చరణ్ ఆసక్తి చూపాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. కారణం.. ఇది కేవలం స్పోర్ట్స్ డ్రామా కాకుండా, గ్రామీణ బ్యాక్ డ్రాప్‌లో సాగే రా అండ్ ఎమోషనల్ కథ కావడమే! ఇంకా స్క్రిప్ట్ బాగా కుదిరిందని, ఆ స్క్రిప్ట్ కి పడిపోయాడట చరణ్. దేశీ పెహల్వాన్ పాత్ర కోసం చరణ్ దాదాపు ఏడాదికి పైగా ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. షూటింగ్ లో నిజమైన పెహల్వాన్లను ఉపయోగించడం కూడా ఇప్పుడు చర్చగా మారింది. ఫైట్ సీన్స్ ఎక్కువగా నాచురల్ గా కనిపించేందుకు రియల్ రెజ్లర్లతోనే రిహర్సల్స్ చేశారట. అయితే, ఆ ఫైట్స్ లోనే చరణ్ చేతికి గాయమైంది. అయినా షూటింగ్ ఎక్కడా ఆగలేదు. ఇలాంటి రియలిస్టిక్ అప్రోచ్ సినిమాకు ప్లస్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అది ఆడియన్స్‌కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో రిలీజ్ తర్వాతే క్లారిటీ వస్తుంది.



కథానాయకులు ప్రధాన పాత్రలు పోషించే చిత్రాలకు లభించే బడ్జెట్‌లు, మద్దతు లాంటివి నాయికా ప్రాధాన్య ప్రాజెక్టులకు దొరకవంటోంది బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషి. ఇటీవలే కేన్స్ చిత్రోత్సవంలో పాల్గొన్నారీమె. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో చిత్రపరిశ్రమ గురించి మాట్లాడారు. "మనది చాలా వైవిధ్యమైన దేశం. మనదైన శైలిలో మహిళా ప్రాధాన్య కథలను రూపొందించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఎలాంటి రీమేక్‌లు చేయకుండా.. ఒరిజినల్ కంటెంట్‌ను రూపొందించాలి. మన పురాణాలు, సంస్కృతులపై కూడా దృష్టిపెడతారని ఆశిస్తున్నా. హీరోలకు లభించే బడ్జెట్‌లు మాకు లభించవు. మహిళా చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద ఒక నిర్దిష్ట సామర్థ్యం మాత్రమే ఉంటుందనే పక్షపాత ధోరణి ఇండస్ట్రీలో ఎప్పుడూ ఉంటుంది. ఈ రోజుల్లో కూడా అలా ఉంటుందా అంటే బహుశా దాని గురించి ఎవరూ అంతగా మాట్లాడకపోయి ఉండొచ్చు. అంతేకానీ, లేదని మాత్రం కాదు. ప్రస్తుతం నేను కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాను. ఇది నిరంతరం ఎదుర్కోవాల్సినదే. దానిని అధిగమించడానికి ఏకైక మార్గం ముందుకు సాగిపోతూ పని చేస్తూ ఉండడమే. నేను మాత్రమే కాదు నా తోటి నటీమణులు చాలా మంది.. తమ కెరీర్‌లో తమ కోసమే కాకుండా భవిష్యత్తులో తమ తర్వాత వచ్చే అనేక మంది కోసం వాస్తవ పరిస్థితిని మార్చడానికి నిరంతరం కృషి చేస్తూ ఆ పరిమితులను దాటుతున్నారనే భావిస్తున్నాన"ని అన్నారు. హ్యూమా ప్రస్తుతం యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'టాక్సిక్' చిత్రంలో నటిస్తోంది.

# ఎప్పుడూ అదే పక్షపాత ధోరణి



# ట్రోల్స్‌ను ట్రెండ్‌గా మార్చిన సాయి అభ్యంకర్..

మ్యూజికల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న కుటుంబం నుండి వచ్చినప్పటికీ.. ఎలాంటి సిఫార్సులు లేకుండా కేవలం తన సొంత టాలెంట్‌తో, ఇండిపెండెంట్ ఆడియో సింగిల్స్‌తో ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ (Sai Abhyankar). మమితా బైజు నటించిన 'డ్యూడ్' (Dude) సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో బిగ్గెస్ట్ మ్యూజికల్ బ్రేక్ అందుకున్న ఈ యంగ్ కంపోజర్ ఆల్బమ్స్ ఇప్పటికీ ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి.

తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో సూర్య నటించిన 'కరుప్పు' (Karuppu) సినిమాతో సాయి అభ్యంకర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సూర్య 'కరుప్పు' చిత్రానికి సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందించారు. అయితే, సినిమా రిలీజ్‌కు ముందు, రిలీజ్ అయిన కొత్తలో ఈ చిత్రం ఆల్బమ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ (BGM) పై తీవ్రమైన నెగిటివిటీ, విమర్శలు వచ్చాయి. కానీ, ఇప్పుడు సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సాయి అభ్యంకర్ అందించిన ట్రాక్స్ సోషల్ మీడియాలో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. ఇప్పుడు అదే ట్రాక్స్ రీల్స్, షార్ట్స్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఇందులోని 'ఊరుమ్ బ్లడ్' (Oorum blood) ట్రాక్ ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌ను రూల్ చేస్తోంది.

'డ్యూడ్' సినిమా విషయంలో కూడా మొదట్లో ఇలాగే జరిగి, ఆ తర్వాత చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు 'కరుప్పు' విషయంలోనూ సాయి అభ్యంకర్ 'స్లో పాయిజన్' ఫార్ములా వర్కవుట్ అయ్యిందని అందరూ ప్రశంసలు కురిపిస్తున్నారు.ఇక సాయి అభ్యంకర్ చేతిలో ప్రస్తుతం టాలీవుడ్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ ఉంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ (Allu Arjun) నటిస్తున్న తదుపరి భారీ పాన్‌ఇండియా చిత్రం 'రాకా' (Raaka) ఉంది. ఇదే మొమెంట్ కంటిన్యూ అయితే రాబోయే రోజుల్లో సౌత్ ఇండియాలోనే టాప్ లీగ్ మ్యూజిక్ డైరెక్టర్ల జాబితాలో సాయి అభ్యంకర్ చేరడం ఖాయం.

# జైలర్ 2 రిలీజ్ డేట్‌లో మార్పు.. ఎప్పటికీ వాయిదా పడిందంటే?

సూపర్ స్టార్ రజినీకాంత్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో వస్తున్న చిత్రం 'జైలర్ 2'. సూపర్ హిట్ సక్సెస్ అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంపై అనౌన్స్‌మెంట్ నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దీంతో సినిమా రిలీజ్ కోసం ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకులు ఈగర్‌గా వెయిట్ చేస్తూనే ఉన్నారు. అయితే.. ఎదురు చూస్తున్న కొద్దీ ఈ చిత్రం వాయిదాలు పడుతూనే ఉంది. మొదట జైలర్ 2ను జూన్‌లో రిలీజ్ చేద్దాం అనుకోగా కొన్ని కారణాల చేత వాయిదా పడింది. మళ్లీ ఆగస్టు 15కు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. అయితే.. ఆగస్టు 15 వీకెండ్‌లో భారీ క్లాష్ ఉండటంతో ఇప్పుడు మేకర్స్ గణేశ్ చతుర్థి హాలిడే సీజన్‌ను టార్గెట్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు జైలర్ 2 ను సెప్టెంబర్ 11, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారట మేకర్స్. అలాగే సరైన టాక్ వస్తే జైలర్ 2 తమిళ ఇండస్ట్రీ నుంచి తొలి ₹1000 కోట్ల చిత్రంగా నిలిచే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394